TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : పోలగోని రాజేష్

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam సంపుటి : 2 సంచిక : 86 పేజీలు : 8 గురువారం 29 ఆగస్టు 2024 వెల : 4/-

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్

పి.వెంకటేష్

9949360937,9100900931

# సీఎం ఇలాకలో టీచర్లు లేక స్కూల్ బంద్

- ఎందుకింత నిర్లక్ష్యమని నిలదీసిన హరీశ్‌రావు
- గత 15 రోజులుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాల మూతపడింది





**హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి ఇలాకలో ఉపాధ్యాయులు లేక ఓ పాఠశాల మూతపడింది. కొడంగల్ మండలం అప్పాయిలపల్లి అనుబంధ గ్రామమైన ఆశమ్మకుంట తండాలో గత 15 రోజులుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాల మూతపడింది. ఈ పాఠశాలలో గతంలో ఒక ఉపాధ్యాయుడు ఉండగా అతను ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. అతని స్థానంలో ఇంకొక ఉపాధ్యాయుడిని నియమించారు. కానీ అతను పెళ్లి ఉందని నెల రోజులు సెలవు పెట్టి వెళ్లిపోయాడు. దీంతో 15 రోజులుగా ఆ పాఠశాల మూతపడింది. మరోవైపు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని పలు గిరిజన పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వారం రోజులుగా తెరుచుకోవడంలేదు. కేబీ కాలనీ మొగడ్‌ధగడ్, శివలింగపూర్, కనికి, జనగాం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. గురుడుపేట గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్‌లో ఉండటంతో 5 గిరిజన పా ఠశాలలు మూతపడ్డాయి. రోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చి.. ఉపాధ్యాయు లు లేక తిరిగి వెళ్తున్నారు. ఎస్సీఆర్పీ మడావి పోచానిని వివరణ కోరగా, ఉపాధ్యాయులు - మిగతా3లో



# హైడ్రా లక్ష్యం నెరవేరేనా?

- కాలనీలకు కాలనీలే మునిగిపోతున్నాయి?
- వరదలను నివారించాలంటే ఆక్రమణలను తొలగించి చెరువులను కాపాడడం ఒక్కటే పరిష్కారమని సూచిస్తున్నారు
- ఇప్పుడు హైడ్రా చేస్తున్న తొలగింపులతో లక్ష్యం నెరవేరుతుందా? అనేది చూడాల్సివుంది?

# నిబంధనలు పాటించని భవనాలను కూల్చివేస్తాం

- హైడ్రాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- "హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువులు నాళాలపై కూల్చివేతలకు తొలి ప్రాధాన్యత ఇస్తాం
- ఓల్డ్ సిటీ కాదు ఏ సిటీ అయినా వెనక్కి తగ్గేది లేదు
- సుప్రీంకోర్ట్, ఎన్జీటీ మార్గదర్శకాలు పాటిస్తున్నాం



**హైదరాబాద్:**

హైదరాబాద్ మహానగరంలో హైడ్రా కూల్చివేతలపై రాజకీయ ప్రకంపనలు రేగుతున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఎప్పటికీ వెనక్కి తగ్గదని ఫుల్ క్లారిటీ ఇచ్చారు. తన మొదటి ప్రాధాన్యత చెరువులను కాపాడటమేనని, పార్టీలతో సంబంధం లేదని చెప్పారు. హైడ్రా తన పని తాను చేసుకుంటూ పోతుందని ఆయన స్పష్టం చేశారు. " ఓల్డ్ సిటీ కాదు ఏ సిటీ అయినా వెనక్కి తగ్గేది లేదు" అని హెచ్చరించారు. "హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువులు నాళాలపై కూల్చివేతలకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. నిబంధనలు పాటించని భవనాలను కూల్చివేస్తాం. తొలి కూల్చివేత మొదలుపెట్టిందే కాంగ్రెస్ నేత పల్లం రాజు నుంచి. కేటీఆర్ ఫామ్ హౌస్‌కి అనుమతి సర్పంచి నుంచి తీసుకున్నాం అని అంటున్నారు. సర్పంచ్ ఎలాంటి అధికారిక అనుమతులు ఇవ్వరు. ప్రజా ప్రయోజనాల కోసమే కూల్చివేతలు జరుగుతు న్నాయి. గత పదేళ్లలో చెరువులను, నాలాలను కబ్జా చేసి కట్టినందుకు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి కేసీఆర్ - మిగతా3లో

# తెలంగాణ తల్లి దొరల కోటలో బందీకావొద్దు



- పదేళ్ల నుంచి తెలంగాణ తల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది
- మిలియన్ మార్చ్ తరహాలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ మహోత్సవం...
- డిసెంబరు 9న లక్షలాది మంది తెలంగాణ బిడ్డల సమక్షంలో వేడుక
- పదేళ్లు అధికారంలో ఉన్నా గత పాలకులకు తెలంగాణ తల్లి గుర్తుకురాలేదు...
- మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం
- తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్**

సెక్రటేరియెట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ జరిగింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ భవన ప్రధాన ద్వారం సమీపంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే భూమి పూజ సైతం నిర్వహించింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తామని ఇప్పటికే రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విగ్రహం ఏర్పాటుకు బుధవారం రేవంత్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు బుధవారం శుభ దినమని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి తెలంగాణ తల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2004 కరీంనగర్‌లో - మిగతా3లో



# కోల్‌కతా ఘటన భయానకం..

- రాష్ట్రపతి తొలి స్పందన
- మహిళలపై జరుగుతున్న నేరాలకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలి
- అక్కాచెల్లెళ్లు, కుమార్తెలు ఇలాంటి అఘాయిత్యాలకు గురికావడాన్ని ఏ నాగరిక సమాజం అనుమతించదు
- నీచమైన ఘటనల విషయంలో సమాజం తనను తాను ఆత్మపరిశీలన చేసుకోవాలి

# రాసి పెట్టుకో..

తెలంగాణకు అక్కరకు రానివాళ్ల బొమ్మలను తొలగిస్తాం.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ వార్నింగ్




**హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని విరుచుకుపడ్డారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం - మిగతా3లో

శాసనసభ

గురువారం 29 ఆగస్టు 2024

# పోచమ్మ తల్లి ఆశీస్సులే శ్రీరామరక్ష.





**-ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం.**

**తుర్కయంజాల్,ఆగస్టు 28(శాసన సభ ):** పోచమ్మ తల్లి ఆశీస్సులే తమకు శ్రీరామరక్ష తుర్కయంజాల్ పురపాలక సంఘం కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఓం గణేష్ నగర్ కాలనీ ఫేస్ -2 లో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాలకు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసుకు నచ్చిన దేవుని సన్నిదికి వెళ్లి దర్శించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందనిఅన్నారు. అనంతరం రూ 51 వేయి విరాళాన్ని అందజేశారు



# తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ. 25 వేల కోట్లతో ఆంధ్ర, తెలంగాణ, బిహార్, పంజాబ్, యూపీ, కేరళ తదితర రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అందుకోసం రూ. 25 వేల కోట్లు ప్యాకేజీ కేటాయించేందుకు ఆమోద ముద్ర వేసింది. తద్వారా ఆ యా రాష్ట్రాల్లో పారిశ్రామిక వృద్ధి, ఆర్థిక అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది. ఇక ఈ కొత్త ప్రాజెక్ట్‌ల ద్వారా రూ.1.5 ట్రిలియన్ పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ ప్రణాళికలో భాగంగా గృహ, వాణిజ్య ప్రాంతాలతో కూడిన సగటు పారిశ్రామిక నగరాలు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ తయారీని పెంచడం, ఉపాధిని సృష్టించడం సాధ్యమని కేంద్ర ఆర్థికశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ఈ ఎన్నికల బరిలో దిగాయి. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఓటరు కూటమికి పట్టం కట్టాడు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. అందులోభాగంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధాని నరేంద్ర మోదీతోపాటు వివిధ శాఖల మంత్రులను సీఎం చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా పలుమార్లు కలిసి విజ్ఞప్తిలు చేసిన సంగతి తెలిసిందే. అదీకాక కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పలు వరాలు ప్రకటించింది. అలాగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా సైతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అంతేకాదు.. విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అండగా నిలబడతామంటూ ఆ వేళ.. మోదీ, షా ద్వయం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.



## విజయన్ సర్కారుపై ప్రతిపక్షాల మండిపాటు.. ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రశ్నలు..!

కేరళలోని లెఫ్ట్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. హేమా కమిటీ నివేదికపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు పలు ప్రశ్నలు లేవనెత్తాయి. పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం కీలకమైన వాస్తవాలను దాచిపెట్టి.. ప్రముఖులకు రక్షణ కల్పిస్తోందని ఆరోపించాయి. కమిటీ నివేదిక ఈ నెల 19న విడుదలైన విషయం తెలిసిందే. కేరళ సీఎం పినరయి విజయన్‌కు సమర్పించిన ఐదేళ్ల తర్వాత నివేదిక విడుదలవగా.. దోపిడీ, లైంగిక వేధింపులు, అధికార దుర్వినియోగం, పలు చీకటి కోణాలను కమిటీ వెల్లడించింది. కమిటీ నివేదిక వెలువడిన నుంచి పలువురు నటీమణులు నటులు, దర్శకులు వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపించారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీషన్ మాట్లాడుతూ కమిటీ నివేదిక విషయంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిందని ఆరోపించారు. ప్రభుత్వం దాడుగుమూతలు ఆడుతూ కొందరిని కాపాడే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలతో సినీ పరిశ్రమలో అందరూ ఇబ్బందులు పడుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో కలుగుతుందన్నారు. పరిశ్రమలో చాలామంది వ్యక్తులు ఉన్నారని.. ప్రభుత్వం అసలు దోషులను దాస్తోందని ఆరోపించారు. అందుకే అమాయకులు సైతం అవమానపడాల్సి వస్తుందని.. ఈ సమస్యను పరిష్కరించాలని సతీషన్ మలప్పురంలో విలేకరులతో మాట్లాడుతూ కమిటీ నివేదికపై ప్రభుత్వం మౌనం వహిస్తుందని, ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. లైంగిక నేరాలను దాచిపెట్టడం కూడా నేరమని చట్టం చెబుతున్నా.. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు అని ప్రశ్నించారు. హేమా కమిటీ నివేదికలోని పేజీలను, పేరాలను సమాచార హక్కు చట్టం కింద తొలగించి ప్రభుత్వం ఎవరిని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది.. హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న సినీ పరిశ్రమలో డ్రగ్స్ విస్తృతంగా వినియోగంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అంటూ నిలదీశారు. మహిళల పట్ల ప్రభుత్వం ఎందుకు ఈ వైఖరి అవలంబిస్తోంది అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు చెప్పి.. నిర్ణయాలు తీసుకుంటే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పని ప్రదేశంలో ప్రతి ఒక్కరి భద్రత కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# రేపిస్టులకు మరణశిక్ష.. 10 రోజుల్లో బిల్లు

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ప్రశాంతతను తాము కోరుకుంటున్నామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. తృణమూల్ ఛాత్ర పరిషత్ ఫౌండేషన్ డే సందర్భంగా బుధవారంనాడు కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, అత్యాచారా లకు పాల్పడే వారికి ఉరిశిక్ష పడాల్సిందేనన్నారు. వచ్చే వారంలోనే అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేసి, రేపిస్టులకు మరణశిక్ష పడేలా 10 రోజుల్లో బిల్లును ఆమోదిస్తామని తెలిపారు. బిల్లును గవర్నర్‌కు పంపిస్తామని, ఆయన ఆమోదించకుంటే రాజ్‌భవన్ ఎదుట బైఠాయింపు చేపడతామని చెప్పారు. "బిల్లు ఆమోదించాల్సిందే. ఈసారి ఆయన (గవర్నర్) జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేరు" అని మమత స్పష్టం చేశారు.



**ఆర్జీ కర్ డాక్టర్‌కు అంకితం..**

"టీఎంసీ ఈవెంట్‌ను ఆర్‌జీ కర్ డాక్టర్‌కు అంకితం చేస్తున్నాం. మేము న్యాయం కోరుకుంటున్నాం. కానీ బీజేపీ ఈరోజు బంద్‌కు పిలుపునిచ్చింది. వాళ్లు న్యాయం కోరుకోవడం లేదు. వాళ్లు కేవలం బెంగాల్‌ను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారు. బంద్‌కు మేము మద్దతివ్వం. బీజేపీ ఎన్నడూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కనీసం మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామాకు డిమాండ్ చేయలేదు. 'నబన్నా అభియాన్ ర్యాలీ' ఫోటోలు చూశా. పరిస్థితిని సమర్ధవంతంగా అదుపు చేసిన పోలీసులకు నేను సెల్యూట్ చేస్తున్నాను" అని సీఎం అన్నారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచార, హత్యా ఘటనతో ప్రమేయమున్న నిందితుడికి ఉరిశిక్ష పడాల్సిందేనని తాను పదేపదే చెబుతున్నట్టు తెలిపారు.

**ఇంతకంటే పెద్ద నిరసన ఢిల్లీలో: అభిషేక్**

కాగా, విద్యార్థుల నిరసన ర్యాలీపై పోలీసు చర్యకు నిరసనగా బీజేపీ 12 గంటల బంద్‌కు పిలుపునివ్వడంపై టీఎంసీ నేత, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ తీవ్ర స్థాయిలో తప్పుపట్టారు. ఢిల్లీలో ఇంతకంటే పెద్ద నిరసన చేపడతామని బీజేపీని హెచ్చరించారు. ఉన్నావో, హత్రాస్, బద్లాపూర్ ఘటనలు జరిగినప్పుడు ఆ పార్టీ ఏమైందని అడిగారు. మహిళా భద్రత గురించి మాట్లాడే హక్కు వీరికెక్కడిదని నిలదీశారు. బీజేపీ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. బీజేపీ నిరసనలతో రోడ్లపైకి వచ్చిందని, అత్యాచార వ్యతిరేక బిల్లు తీసుకురమ్మని అమిత్‌షా, జేపీ నడ్డాను అడిగే దమ్ము వారికి ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ అలాంటిదేదీ కోరుకోదని, ఎందుకంటే ఎక్కువ మంది రేపిస్టులు, గూండాలు, దుండగులు అక్కడే కనపడతారని విమర్శలు గుప్పించారు.

## 30న బీజేపీలో చేరుతున్నా




బీజేపీలో చేరికపై జార?ండ్ మాజీ సీఎం చంపై సోరెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తదుపరి కార్యాచరణపై తాము ఇంకా చర్చించలేదని, తాను ఈ నెల 30న బీజేపీలో చేరుతున్నానని చెప్పారు. చంపై సోరెన్ బుధవారం రాంచీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పార్టీ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తిస్తానని అన్నారు. గిరిజనుల సంక్షేమంతో పాటు జార?ండ్ ప్రజల అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. బంగ్లాదేశ్ చొరబాట్లతో ప్రమాదంలో పడిన గిరిజనులకు బాసటగా నిలుస్తామని స్పష్టం చేశారు. తాను ఎంతో కష్టపడి ఈస్థాయికి చేరుకున్నానని, జార?ండ్ అభివృద్ధితో పాటు గిరిజనుల ఉనికిని కాపాడేందుకే తాను కాషాయ పార్టీలో చేరుతున్నానని చంపై సోరెన్ వెల్లడించారు. కాగా, చంపై సోరెన్ బీజేపీలో చేరికపై జార?ండ్ బీజేపీ చీఫ్ బాబూలాల్ మరాండీ స్పందించారు. చంపై సోరెన్‌పై జార?ండ్ సర్కార్ నిఘా వేయడం సరైంది కాదని దుయ్యబట్టారు. మాజీ సీఎంపై గూఢచర్యం ప్రయోగించి ఉండాల్సింది కాదని అన్నారు. హనీ ట్రాప్‌నకు కూడా సన్నాహాలు జరిగాయని తమకు సమాచారం అందిందని, ఈ వ్యవహారం అంతటిపై సిట్టింగ్ హైకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని బాబూలాల్ మరాండీ డిమాండ్ చేశారు. చంపై సోరెన్‌కు బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

## కోల్‌కతా ఘటన భయానకం



**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారి స్పందించారు. ఈ ఘటన తనకు తీవ్ర ఆవేదనను, భయాన్ని కలిగించిందన్నారు. ఇక జరిగింది చాలు...అని పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలని అన్నారు. అక్కాచెల్లెళ్లు, కుమార్తెలు ఇలాంటి అఘాయిత్యాలకు గురికావడాన్ని ఏ నాగరిక సమాజం అనుమతించదని చెప్పారు. 'ఒకవైపు విద్యార్థులు, డాక్టర్లు, పౌరులు కోల్‌కతాలో నిరసనలు చేపడుతుంటే మరోవైపు నేరస్థులు మాత్రం స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. అకృత్యాలకు ఏ నాగరిక సమాజం కూడా తమ కూతుళ్లు, సోదరీమణులను బలి ఇవ్వదు. ఇలాంటి నీచమైన ఘటనల విషయంలో సమాజం తనను తాను ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిర్భయ ఘటన జరిగిన 12 ఏళ్ల కాలంలో సమాజం ఎన్నో అత్యాచార ఘటనలను మరిచిపోయింది. ఇటువంటి సామూహిక మతిమరుపు అసహ్యకరమైనది. గత తప్పులను ఎదుర్కొనేందుకు సమాజం భయపడుతోంది. కానీ ఇప్పుడు చరిత్రను సమూలంగా మార్చేందుకు సమయం ఆసన్నమైంది. సమగ్రమైన రీతిలో ఈ సమస్యను నిర్మూలించేందుకు ప్రయత్నిద్దాం" ఆమె పేర్కొన్నారు.

## డీఎంకే ఎంపీకి షాక్ ఇచ్చిన ఈడీ.. రూ.908కోట్ల భారీ జరిమానా!



తమిళనాడుకు చెందిన అధికార పార్టీకి ఎంపీకి ఈడీ భారీ షాక్ ఇచ్చింది. ఆయన, కుటుంబీకులకు భారీగా జరిమానా విధించింది. విదేశీ మారకద్రవ్య నిబంధనలను ఉల్లంఘించిన కేసులో డీఎంకే ఎంపీ ఎస్ జగత్రక్షకన్ ఆయన కుటుంబ సభ్యులకు రూ.908కోట్ల జరిమానా విధించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం తెలిపింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘన కేసులో ఈ భారీ జరిమానా విధించినట్లు ఈడీ స్పష్టం చేసింది. ఇక ఫెమా చట్టంలోని 37ఏ సెక్షన్ ప్రకారం 2020 సెప్టెంబర్‌లో సీజ్ చేసిన రూ.89.19 కోట్ల మొత్తాన్ని జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. ఫెమాలో చట్టంలోని సెక్షన్ 37ఏ ప్రకారం 2020లో సీజ్ చేసిన రూ.89.19 కోట్లను జప్తు చేయాలని.. రూ.908 కోట్లు జరిమానా విధించాలని ఆదేశించింది. ఆగస్ట్ 26న వెల్లడించిన తీర్పు ప్రకారం ఈ జరిమానా విధించినట్లు ఈడీ తెలిపింది. జగత్రక్షకన్ అరక్కోణం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. 2021 డిసెంబర్ 1న, డీఎంకే ఎంపీ జగత్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులు సంబంధిత కంపెనీపై ఫెమాలోని సెక్షన్ 16 కింద నిబంధనలను ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి 2017లో సింగపూర్‌లోని షెల్ కంపెనీలో రూ.42 కోట్ల పెట్టుబడి పెట్టారని విచారణలో తేలింది. ఈ క్రమంలో ఈడీ చర్యలకు ఉపక్రమించింది.

## నాపై చర్య తీసుకునే అధికారం యూపీఎస్సీకి లేదు.. కోర్టులో ఖేడ్కర్ వాదన



**న్యూఢిల్లీ:** యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌పై డిస్మిస్డ్ ఐఏఎస్ అధికారి పూజా ఖేడ్కర్ మరోసారి విరుచుకుపడ్డారు. తనపై చర్య తీసుకునే అధికారం యూపీఎస్‌సీకి లేదన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణ వ్యవహారంలో యూపీఎస్‌సీ ఇటీవల ఆమె అభ్యర్థిత్వంపై అనర్హత వేటు వేసింది. భవిష్యత్తులో సర్వీస్ ఎగ్జామ్స్ రాయకుండా డిబార్ చేసింది. క్రిమినల్ కేసు సైతం నమోదు చేసింది. ప్రస్తుతం ఆమె కేసు ఢిల్లీ హైకోర్టు విచారణలో ఉంది. యూపీఎస్‌సీ చేసిన వాదనను కోర్టు విచారణలో పూజ తోసిపుచ్చారు. తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే అధికారం యూపీఎస్‌సీకి లేదని తెలిపారు. తాను ఎలాంటి ఫోర్జరీ చేయలేదని, తప్పుడు సమాచారం ఇవ్వలేదని కోర్టుకు విన్నవించారు. కాగా, మాజీ ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను యూపీఎస్‌సీ వ్యతిరేకించింది. కమిషన్‌కు, పబ్లిక్‌కు వ్యతిరేకంగా ఆమె ఫ్రాడ్ చేశారని పేర్కొంది. ఇతరుల సహాయం లేకుండా ఇలాంటి అవకతవకలు జరిగి ఉండవని, ఈ ఫ్రాడ్ ఎంత లోతుగా జరిగిందని తెలుసుకోవాలంటే కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమని పేర్కొంది. ఆ కారణంగా ముందస్తు బెయిల్ అభ్యర్థనను తోసిపుచ్చాలని కోర్టును కోరింది. ఢిల్లీ పోలీసులు సైతం పూజా ఖేడ్కర్ ముందస్తు బెయిల్ అభ్యర్థనను తోసిపుచ్చాలని కోర్టును కోరారు. కేసులో మరింత లోతైన దర్యాప్తునకు ముందస్తు బెయిలు అవరోధమవుతుందని వాదించారు. పూజా ఖేడ్కర్ అభ్యర్థిత్వాన్ని జూలై 31న యూపీఎస్‌సీ రద్దు చేయగా, ఐపీసీ, ఇన్‌పర్ఫేషన్ టెక్నాలజీ యాక్ట్, రైట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీ యాక్ట్ కింద ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇచ్చేంత వరకూ అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని హైకోర్టును ఖేడ్కర్ కోరారు. దాంతో ఆగస్టు 29 వరకూ ఖేడ్కర్‌కు హైకోర్టు అరెస్టు నుంచి ముందస్తు రక్షణ కల్పించింది.

# నిబంధనలు పాటించని భవనాలను కూల్చివేస్తాం

-మొదటిపేజీ తరువాయి

సస్పెండ్ చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు.

**కవిత బెయిల్‌పై స్పందన**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కేవలం ఐదు నెలల్లో కవితకు బెయిల్ ఎలా వచ్చిందని సందేహం వ్యక్తం చేశారు. మనీష్ సిసోడియాకు బెయిల్ రావడానికి 15 నెలలు సమయం పట్టిందని, సీఎం కేజ్రీవాల్‌కు ఇప్పటికీ బెయిల్ రాలేదని ఆయన ప్రస్తావించారు. కవితకు ఇంత త్వరగా బెయిల్ రావడానికి బీజేపీ మద్దతు ఉందని అనుకుంటున్నట్టు రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ కోసం బీఆర్ఎస్ పని చేసిందని, 8 సీట్లలో బీజేపీ గెలవడానికి హరీష్ రావు పనిచేశారని విమర్శించారు. బీజేపీ – బీఆర్ఎస్ ఒప్పందం ప్రకారమే కవితకు బెయిల్ వచ్చిందని అన్నారు.

**సుప్రీంకోర్ట్, ఎన్జీటీ మార్గదర్శకాలు పాటిస్తున్నాం: రేవంత్ రెడ్డి**

అక్రమ కట్టడాలపై ప్రజా కోర్టులోనే తేల్చుకుందామని రేవంత్ రెడ్డి అన్నారు. "నా కుటుంబ సభ్యులకు చెందిన అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలు తీసుకుని రావాలి. నేను కేటీఆర్ ఫామ్ హౌస్ అక్రమ కట్టడం అని ఆధారాలతో అక్కడికి వెళ్లాను. కేటీఆర్‌కి దమ్ముంటే నా కుటుంబ సభ్యులు లేదా నావి అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలతో రావాలి. 111 జీవోపై సుప్రీంకోర్టు, ఎన్జీటీ మార్గదర్శకాలను పాటిస్తున్నాం. చెరువులు, కుంటలలో కొన్ని భవనాలు కట్టుకోవడానికి సుప్రీంకోర్టు మినహాయింపు ఇచ్చింది. సెక్రటేరియెట్, జీహెచ్ఎంసీ లాంటి భవనాలరగ సుప్రీంకోర్టు అనుమతి ఉంది. రాయదుర్గంలో కూల్చివేత సరైనదే. ఆ భూమి ప్రభుత్వ భూమి" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**కేటీఆర్ కొడంగల్‌కు వెళ్తానంటే స్వాగతిస్తా...**



మాజీ మంత్రి కేటీఆర్ కొడంగల్‌కు వెళ్తానంటే స్వాగతిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. " కేటీఆర్ కొడంగల్‌కు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడాలి. కేటీఆర్‌ను వాళ్ల తండ్రి కేసీఆర్ నమ్మడు. కర్ణాటకలో వాల్మీకి స్కామ్‌తో మాకు సంబంధం లేదు. తెలంగాణ ఖాతాలు ఉన్నంత మాత్రాన మాకు సంబంధం ఉంటుందా?. వాల్మీకి స్కామ్‌లో బీఆర్ఎస్ నేతలకే లింకులు ఉండొచ్చు. డ్రగ్స్ కోసం కొంతమంది బీఆర్ఎస్ నేతలు బెంగుళూరు వెళ్లడం అందరికీ తెలిసిందే" అని సీఎం అన్నారు.

**కేసీఆర్‌కు, నాకూ పోలిక ఏంటి?**

నేను రేవంత్ రెడ్డినని, తనకు, కేసీఆర్‌కు పోలిక ఏంటి సీఎం అన్నారు. " నేను కొడంగల్, కోస్గి, కొండారెడ్డి పల్లికి మాత్రమే హెడ్‌ను కాదు. రాష్ట్రానికి హెడ్‌ను నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడు. ఆయన బయటకు రావాలి ప్రజల కోసం పోరాటం చేయాలి. కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడు హోదాలో జీతాలు ఇస్తున్నాం. జీతం తీసుకుంటున్నందుకు ప్రజల్లో తిరగాలి. ప్రభుత్వ వ్యవస్థలను వాడుకుంటున్న ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ పనిచేయకపోతే ఎలా?" అని సీఎం పేర్కొన్నారు. రుణమాఫీపై ధర్నాలు చేసేది బీఆర్ఎస్ కార్యకర్తలేనని, బీఆర్ఎస్ ధర్నాల్లో రైతులు లేరని, వాళ్ల పార్టీ కార్యకర్తలే ఉన్నారని విమర్శించారు. "హరీష్ రావు, కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తిరిగి రైతుల లిస్టు తయారు చేసి కలెక్టర్లకు ఇచ్చి పదేళ్లు చేసిన పాపాలను కడుక్కోండి. పార్టీలో చేరేవారు మా పాలన నచ్చి చేరుతున్నారు. మేము ఎవరిని భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదు. మాకు కావలసినంత బలం ఉంది. చెరువులపై హరీష్ రావుకు మంచి అవగాహన ఉంది. అందుకే ఆయన హయాంలో కమిషన్ కాకతీయ వచ్చింది. చెరువుల కబ్జాలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దాం. హరీష్ రావును ముందు పెడదాం. ఎవరి కబ్జాలు ఏంటో అప్పుడు తేలుతుంది." అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**హరీష్ రావు దొంగ అని నాకు తెలుసు: సీఎం రేవంత్ రెడ్డి**

హరీష్ రావు దొంగ అని తనకు తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "రుణమాఫీపై హరీష్ రావు చేసిన సవాల్‌కు కట్టుబడి లేదు. రాజీనామా చేయకుండా హరీష్ రావు పారిపోయారు. ఓడిపోయిన దొంగ హరీష్ రావు. రుణమాఫీ అనేది నా కమిట్మెంట్ నేను చెప్పాను చేసి తీరాను. ఇచ్చిన హామీలపై మూడు పార్టీలు బహిరంగ చర్చలు జరుపుదాం. అన్ని పార్టీల మేనిఫెస్టోలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చిద్దాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. అప్పుడు కూడా పారిపోవద్దు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కాలేదు అంటే కేటీఆర్, హరీష్ రావు గ్రామాలు తిరగాలి. రాష్ట్రంలో అన్ని గ్రామాలు తిరిగి రైతుల ఖాతాలను లిస్టు తయారు చేసి కలెక్టర్లకి ఇవ్వాలి.

# తెలంగాణ తల్లి దొరల కోటలో బందీకావొద్దు

-మొదటిపేజీ తరువాయి

తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మాట ఇచ్చారని. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తరువాత అనేక రకాలుగా వెనుక బడ్డారన్నారు. తెలంగాణ తల్లిని వెనక్కి నెట్టి వారే సర్వం అన్నట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. ముళ్ళ కంచె ఏర్పాటు చేసుకొని రాజ భోగం అనుభవించారన్నారు. అది ఒకప్పుడు ఘడీల భవనమని. ఇప్పుడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవనమని పేర్కొన్నారు.

పదేళ్లు ముఖ్యమంత్రి , మంత్రులు ఎవరూ అందుబాటులో లేరని. అసలు సచివాలయంలోకి సామాన్యులకు ఎంట్రీయే లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి సచివాలయం నిర్మించిన వాళ్లకు కోటి రూపాయలు పెట్టి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేకపోయారని రేవంత్ విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదురుగా పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సచివాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో కొంతమంది తమ కోసం ఆపారన్నారు. తెలంగాణ తల్లి అంటే దర్పం, పోరాట పటిమకు స్ఫూర్తి అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి దొరల కోటలో బందీ కావొద్దన్నారు. పరిపాలనకు గుండెకాయ వంటి సచివాలయ ప్రాంగణంలో డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది మంది తెలంగాణ బిడ్డల సమక్షంలో ఆ రోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భూమి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలనుకున్నామని, వేద పండితులను సంప్రదిస్తే ఈ రోజు మినహా దసరా వరకు మంచి రోజులు లేవని



చెప్పారన్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు ఉప ముఖ్యమంత్రి కేరళ పర్యటనకు వెళ్లడం, మంత్రుల ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో హడావుడిగా కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందన్నారు.

సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది లేదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఇచ్చిన మాట మేరకు సోనియా గాంధీ 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. 2014లో తెలంగాణ ఏర్పాటు కావడం సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమన్నారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లు తెలంగాణను పాలించిన వారు ఎన్నెన్నో నిర్మించామని, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచామని గొప్పలు చెప్పకున్నారని,

కానీ తెలంగాణ తల్లిని తెరమరుగు చేసే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. తామే తెలంగాణకు సర్వస్వమని భావించారని, తానే తెలంగాణ... తెలంగాణే తాను అనే విధంగా విధంగా గత పాలకులు వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అలాంటి విధానాలకు విరుద్ధమన్నారు. ప్రగతి భవన్ పేరిట గడీ నిర్మించుకొని, భారీ కంచెలు ఏర్పాటు చేసుకొని వందలాది మంది పోలీసు పహారా పెట్టుకొని తెలంగాణ ప్రజలను అందులోకి రాకుండా నిషేధించారని, తాము అధికారంలో వచ్చాక ప్రగతి భవన్ పేరును ప్రజా భవన్‌గా మార్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గడీగా మారిన ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఇప్పుడు ఎవరైనా ప్రజా భవన్‌లో స్వేచ్ఛగా వెళ్లవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. పాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర పాలనకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఇక్కేడ జరుగుతాయని, ప్రజలు తమ సమస్యలను తెలుపుకొనే అవకాశం ఇక్కడే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా ఉన్న వారు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో రూ. 22.50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టిన వారికి రూ.కోటి పెట్టి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు మనసు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ చుట్టుపక్కల ఈ దేశం, రాష్ట్రం కోసం ఎంతో చేసిన అంబేద్కర్, ఇందిరా గాంధీ, అంజయ్య, పి.వి.నరసింహారావు, కాకా వెంకటస్వామి విగ్రహాలు, జైపాల్ రెడ్డి సమాధి ఉన్నాయని, వీటి మధ్య రాజీవ్ గాంధీ విగ్రహం లేని లోటుగా కనిపించిందని ముఖ్యమంత్రి అన్నారు. సచివాలయం ఎదుట ప్రదేశాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ఉంచుకోవాలని భావించారని, కానీ మేధావుల సూచన మేరకే తాము అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. దేశం కోసం ఎంతో చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడిపెట్టి దానిని వివాదం చేసేందుకు ప్రయత్నించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గులాబీ నేతలకు హైడ్రా గుబులు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకున్న తర్వాత ప్రతిపక్ష పార్టీ నేతలకు రోజుకు ఓ రకంగా టెన్షన్ పట్టుకుంటోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ముందుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలు టెన్షన్ పట్టించాయి. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన పదిమంది శాసనసభ్యులు, పలువురు శాసనమండలి సభ్యులు హస్తం పార్టీలో చేరిపోయారు. బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్షం విలీనం అవుతుందంటూ రాజకీయంగా జోరుగా ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కానీ.. రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గులాబీ నేతల్లో మరింత ఆందోళన రేపుతున్నాయి. తెలంగాణలో రాజకీయం ప్రస్తుతం ఈ వ్యవహారం చుట్టే తిరుగుతోంది.చెరువులు, కుంటలు వంటి నీటి వనరులను కాపాడేందుకు, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రాను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఒక సీనియర్ అధికారి రంగనాథ్‌ను ఇన్చార్జిగా నియమించింది. గత కొన్ని రోజులుగా దూకుడు పెంచిన హైడ్రా భూకబ్జాలపై కొరడా ఝుళిపిస్తోంది. ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌తో పాటు 18 ప్రాంతాల్లో 166 కట్టడాలను నేలమట్టం చేసింది. మరి కొంతమందికి నోటీసులు జారీ చేసింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కీలక నేతలుగా చలామణి అవుతున్న ఎంతోమంది నేతలు హైడ్రా టార్గెట్‌లో ఉన్నారన్న చర్చ గులాబీ నేతలను ఆందోళనకు గురిచేస్తుంది. జన్వాడ



సమీపంలోని ఫామ్‌హౌస్ చుట్టూ వివాదం ముదురుతోంది. ఈ ఫామ్‌హౌస్‌ను హైడ్రా కూల్చేస్తుందన్న ప్రచారంతో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రదీప్ రెడ్డి- కోర్టును ఆశ్రయించారు. దీంతో అన్ని అనుమతులు పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని హైకోర్టు హైడ్రాకు సూచించింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యాసంస్థలు కూడా సాగునీటి వనరుల బఫర్ జోన్లో ఉన్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. దీంతో ఎమ్మెల్యే పల్లా అలర్ట్ అయ్యారు. అన్ని అనుమతులతోనే తాను విద్యాసంస్థలు నిర్మించానని న్యాయస్థానం తలుపు తట్టారు. దాదాపు 25 ఏళ్ల క్రితం నుంచి విద్యాసంస్థలు నడుపుతున్నానని.. గత 9 నెలలుగా ప్రభుత్వం నుంచి వేధింపులు మొదలయ్యాయన్నారు. ఈ వ్యవహారాన్ని గులాబీ పార్టీ కూడా సీరియస్‌గా పరిగణిస్తోంది. రెండు మూడు నెలల క్రితమే పార్టీ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిల విద్యాసంస్థలు అక్రమ నిర్మాణాలని వివాదం రేగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తున్న గులాబీ పార్టీ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించింది. కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న ఒత్తిళ్లకు తమ ఎమ్మెల్యేలు భయపడకపోవడంతో పార్టీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్రతో వ్యవహరిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అన్ని అనుమతులతోనే పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యాసంస్థల నిర్మాణం జరిగిందన్నారు.అక్రమ నిర్మాణాల పేరుతో గులాబీ నేతలను ప్రభుత్వం టార్గెట్ చేస్తే.. తాము కూడా అందుకు అనుగుణంగా రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

## సీఎం ఇలాకలో టీచర్లు లేక స్కూల్ బంద్

-మొదటిపేజీ తరువాయి

బదిలీపై వెళ్లడంతో పాఠశాలలు నడవడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. టీచర్లు లేక స్కూళ్లు మూతబడటంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఉపాధ్యాయులు లేక పాఠశాల మూతపడటం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. గత 15 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పి, ఇప్పుడు ఉన్న ప్రభుత్వ స్కూళ్లను మూతపడేలా చేస్తున్నారని.. పేద పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పాఠశాలలు మూతపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నప్పటికీ విద్య పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. తక్షణమే పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించి పాఠశాలను మూతపడకుండా చూడాలని, మూతపడ్డ పాఠశాలలను తెరిపించి విద్యా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాసి పెట్టుకో..

-మొదటిపేజీ తరువాయి

అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తమ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

ఈడీ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇద్దరూ కూడా 2015 డిసెంబర్‌లో బెయిల్ పొందారు.

%-% ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఆమ్ ఆద్మీ పార్టీ చేరింది. ఆ పార్టీ నాయకుడు మనీశ్ సిసోడియా వారం కిందట బెయిల్‌కొచ్చారు.

%-% తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఓటుకు నోటు కేసులో 2015 నుంచి బెయిల్ మీదే తిరుగుతున్నారు. ఇవన్నీ కూడా కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే జరిగాయని కేటీఆర్ అన్నారు. పై అంశాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా పార్టనర్స్ అని అనుకోవచ్చా? అని ప్రశ్నించారు.

## ఇంటికి చేరుకున్న ఎమ్మెల్సీ భావోద్వేగం.. కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో దాదాపు 5 నెలలు తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న (మంగళవారం) బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఇవాళ (బుధవారం) ఆమె హైదరాబాద్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కవితకు దిష్టి తీసి అభిమానులు ఇంట్లోకి ఆహ్వానం పలికారు. ఇక బంధువులు, కుటుంబ సభ్యులు పూల వర్షం కురిపించి కవితకు ఘన స్వాగతం పలికారు.

**ఇంట్లో భావోద్వేగ దృశ్యాలు..**

ఇంట్లోకి వెళ్లిన తర్వాత నేరుగా పూజ గదికి వెళ్లి దేవుళ్లకు దండం పెట్టుకున్నారు. కవితను కలిసిన వెంటనే తల్లి శోభ, ఇతర కుటుంబ సభ్యులు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తల్లి శోభమ్మ పాదాలకు నమస్కరించి కవిత ఆశీర్వాదం తీసుకున్నారు. కూతురిని ఆప్యాయంగా హత్తుకున్నాక తల్లి శోభ కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిని పట్టుకుని కవిత కూడా ఏడ్చారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ఇక తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆమె రాఖీ కట్టారు

## హైడ్రా లక్ష్యం నెరవేరేనా?



**హైదరాబాద్ :** చెరువులు కబ్జాలకు గురికావడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో చిన్నపాటి వర్షం పడినా.. రోడ్లన్నీ చెరువులైపోతున్నాయి. కాలనీలకు కాలనీలే మునిగిపోతున్నాయి? పరిస్థితి ఇలాగే కొనసాగితే నగరానికి భవిష్యత్‌లో ప్రమాదం తప్పదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరదలను నివారించాలంటే ఆక్రమణలను తొలగించి చెరువులను కాపాడడం ఒక్కటే పరిష్కారమని సూచిస్తున్నారు. ఇప్పుడు హైడ్రా చేస్తున్న తొలగింపులతో లక్ష్యం నెరవేరుతుందా? అనేది చూడాల్సివుంది?. హైదరాబాద్ నగరంలో చెరువుల ఆక్రమణ నిత్యకృత్యంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర నగరాలతో పోల్చిచూస్తే హైదరాబాద్‌లో ఈ సమస్య తీవ్రత ఎక్కువనే చెబుతున్నారు. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటం? భూమి విలువ వందల రెట్లు పెరిగిపోవడంతో ఆక్రమణలు, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇదే నగరానికి ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్ పూర్తిగా మెట్ట ప్రాంతం, సముద్రానికి 600 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రదేశం.డెక్కన్ పీఠ భూమిలో ఉన్న హైదరాబాద్‌కు వర్షపు నీరే ఆధారం. వర్షం నీటిని వడిసి పట్టుకుంటేనే ప్రజల దాహార్తి తీరేది. వర్షం పడితేనే నీరు, లేకుంటే గుండె చెరువు అన్నట్లు తయారైంది హైదరాబాద్ పరిస్థితి. ఇక్కడ పడే ప్రతి నీటి చుక్కను కాపాడి ప్రజల అవసరాలను తీర్చడానికి వందలాది చెరువులు తవ్వగా, అవేవీ ఇప్పుడు కనిపించకపోవడం ఆందోళనకరం.నీటి వనరులను ధ్వంసం చేస్తుండటం అత్యంత ప్రమాదమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. వర్షపు నీరు పట్టుకుని వాడుకునే వ్యవస్థలో ఇప్పటికీ చెరువుది కీలక భూమిక. చెరువులు ఉంటేనే చల్లదనం, పచ్చదనం, ఆహారం, జీవ వైవిధ్యం. కానీ, రియల్ భూమ్‌తో కాసులకు కక్కుర్తి పడి చెరువులను చెరబడుతున్నారు.నగరంలో వందలాది చెరువుల్లో భవనాలు, వ్యాపార సముదాయాలు వెలిశాయి. నీటి వనరులను భూములుగా మార్చే వ్యాపార వస్తువుగా మార్చేయడంతో నగరంలో చెరువులు క్రమంగా కనుమరుగయ్యాయి. చెరువుల రక్షణకు చట్టాలు ఉన్నా, ఇన్నాళ్లు అవేవీ సక్రమంగా అమలు కాలేదు. ఫలితంగా నీటి కుంటలు కాలనీలుగా మారాయి.

## సంపాదకీయం

# బిజెపి రాష్ట్రాల్లోనూ.. ఇంతే కదా!

ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో అరెస్టయిన సివిక్ పోలీస్ వాలంటీర్ రాయ్ నిన్న మేజిస్ట్రేట్ ఎదుట మాట మార్చి నేను అమాయకుడినని తనకు ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని చెప్పాడు. మరి ఈ ఘాతుకం ఎవరు చేశారు? లక్షలాదిమంది రోగులకు సేవ చేయవలసిన ఈ యువ డాక్టర్ అన్యాయంగా విగతజీవిగా మారితే ఆ పాపంలో ఎవరి వాటా ఎంత? పేద కుటుంబం నుంచి వచ్చి రెండోసారి ప్రయత్నంలో పీజీలో సీటు సాధించిన బాధితురాలు హాస్పిటల్‌లో చేరింది మొదలు హత్యాచారానికి గురయ్యే వరకు ఒక్కరితో కూడా వాదన పెట్టుకున్న దృశ్యాన్ని చూడలేదని ఆమెతో పనిచేసిన జూనియర్ గుర్తుచేసుకొని బాధపడ్డారు. అలాంటి అమ్మాయిని ఎవరు అంత దారుణంగా హత్యాచారం చేశారు..? ఈ ఘటనలో ఆర్‌జి కార్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ నిర్లక్ష్యం ఈ కేసులో అడుగడుగునా కనిపిస్తుంది. ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నా స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో అదే హాస్పిటల్‌లో రెండుసార్లు ట్రాన్స్ఫర్ అయినా అక్కడే కొనసాగుతున్నాడంటే తన పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అంచనా వేయవచ్చు. ఈ మొత్తం ఘటనపై మమత ప్రభుత్వం వ్యహరించిన తీరు దారుణం అనే చెప్పాలి. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన హత్యాచారం కేసుల్లో ఆ రాష్ట్ర పాలిట ప్రభుత్వాలు స్పందించిన తీరు దీనికి భిన్నంగా ఉందా? ఒకప్పుడు మమత ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన సువెందు అధికారి నేతృత్వంలో బీజేపీ ఆమె ప్రభుత్వంపై ముప్పేట దాడి ప్రారంభించింది. హత్యాచారం తీవ్రత దృష్ట్యా ఇప్పుడు కేసు సుప్రీంకోర్ట్ పర్యవేక్షణలో ఉంది. ఇప్పటికే హైకోర్టు ఉతర్వులతో కేసు సీబీఐ పరిధిలోకి పోయింది. ఈ దారుణ సంఘటనకూ, రాష్ట్ర ప్రభుత్వానికీ సంబంధమున్నట్టుగా బీజేపీ ప్రచారం ప్రారంభించింది. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన హత్యాచారం కేసుల్లో ఆ రాష్ట్ర పాలిట ప్రభుత్వాలు స్పందించిన తీరుపై పరిశీలిద్దాం. యోగి ముఖ్యమంత్రిగా వున్నా బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో 8 ఏళ్ల ముస్లిం అమ్మాయిని ఒక హిందూ గుడిలో మత్తు మందిచ్చి, తిండి పెట్టకుండా రోజుల తరబడి మాడ్చి అత్యాచారం చేసి అవసరం తీరాక బండతో తలను ఛిద్రం చేసి, హత్య చేసిన రేపిస్టులకు హిందుత్వ సంఘాలు వత్తాసు పలికాయి. అగ్రవర్ణాలకు చెందిన ఇద్దరు యువకులు యూపీలోని హత్రాస్‌లో దళిత కులానికి చెందిన యువతిని చెరకు తోటలో లైంగికదాడి చేసి ఆమె నడుములు విరగ్గొట్టడం జరిగింది. సంఘటన జరిగిన తర్వాత కూడా రెం డువారాలు బతికింది. చనిపోతూ యువతి నిందితుల పేర్లు చెప్పింది. ఆమెకు ఇప్పటివరకు న్యాయం జరుగలేదు. జరుగుతుందనే ఆశ కూడా లేదు. ఎందుకంటే శవాన్ని తల్లిదండ్రుల అభీష్టానికి విరుద్ధంగా పోలీసులు అర్ధరాత్రి హడావుడిగా యువతికి డీఎన్ఏ పరీక్ష నిర్వహించకుండానే దహనం చేశారు. ఇక్కడ కూడా హిందుత్వ సంఘాలు నిందితులకు వత్తాసు పలికాయి. పరాకాష్ట ఏమంటే సంఘటనను కవర్ చేయటానికి వెళుతున్న ఢిల్లీ నుండి వెళుతున్న జర్నలిస్టును ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి ఏళ్ల తరబడి జైల్లో ఉంచిన ఘటనను మనం ఇంకా మర్చిపోలేదు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా పాలించిన తొలిరోజుల్లో గోద్రా ఘటనతో చెలరేగిన మతకలహాల్లో బిల్కిస్ బానో అత్యాచారం చేసి ఆమె మూడేళ్ల కూతురు హత్యకు కారకులైన హంతకులకు కోర్టు జీవిత శిక్ష విధించగా గుజరాత్ బీజేపీ సర్కార్ శిక్ష కాలం పూర్తి కాకుండానే విడుదల చేసింది. ఈసందర్భంలో దోషులకు హిందుత్వ సంఘాలు శాలువాలు, మిఠాయిలతో సన్మానం చేసి ఫోటోలకు ఫోజులిచ్చి పత్రికలకు విడుదల చేసిన సంఘటనను దేశ ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇవన్నీ పక్కకుపెట్టి బీజేపీ పార్టీ ఈ మొత్తం ఘటనపై మమత ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై విమర్శిస్తున్నారు కానీ మరి మీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన హత్యాచారం కేసుల్లోనూ ఇంతే స్పందించి ఉంటే బాగుండేది. ఏది ఏమయినా కనీసం ఈ కేసులోనైనా నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారించి నిర్భయ చట్టంలో పేర్కొన్నట్లు శిక్షించాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగ కుండా సత్వర న్యాయం అందిస్తారని ఆశిద్దాం.

# తెలుగు సాహితీ పితామహుడు





ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే వారు అసామాన్యులు. కాలూనిన అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి. చరిత్రలో లభ్యమవుతున్న, మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్టే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్య జీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ధి' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్ధరకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలములో కృష్ణా నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారములతో సవివరముగా పరిష్కరించి ప్రకటిం చారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క, తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వ్మాయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచు కుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.

# తెలుగు మాధ్యమమే ముద్దు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసు కున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదా యాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరమని భారత రాజ్యాంగం (అధికరణం 350 ఎ), కొఠారీ కమిషన్ చెప్పింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం విభాగం 29(2)లో ఎలిమెంటరీ స్థాయిలో వీలైనంత వరకు మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానం (2020) కూడా ఐదవ తరగతి వరకు మాతృభాష లోనే బోధన జరగాలి అని చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ- యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫరాల్ (ఎఫ్ఎఫ్ఏ) జనరల్ అసెంబ్లీ లాంటి సంస్థలన్నీ పిల్లలకు ప్రాథమిక విద్యని మాతృభాషలో నేర్చుకునే హక్కుందని నిర్ధారించాయి. ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమం లోనే విద్యాబోధన చేసి 6వ తరగతి తరువాత ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ కొనసాగిస్తే ఎవరికి ఇష్టమైన మాధ్యమంలో వాళ్లు విద్యాభ్యాసం చేస్తారనేది అనేకమంది వాదన.

వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన




ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టి పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తు కున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతా యని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న తాజా మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత తాజా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

## ప్రజాపాలనలో ఆరోగ్య తెలంగాణ

తెలంగాణలో ప్రజా ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ప్రతి పౌరుడికి వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సర్కారు దవాఖానాలలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కావాల్సిన చర్యలను చేపట్టింది. హైదరాబాద్‌ను వైద్య రాజధానిగా తీర్చిదిద్దుతుతుంది. దేశంలోనే తెలంగాణ అనేది మెడికల్ హబ్‌గా మారింది. దేశానికి ఆదర్శంగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ నిలిచింది. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయ కంగా మారింది. రాష్ట్రానికి ముఖ్యమం త్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. అలాగే హెల్త్ ఎడ్యుకేషన్, మెడికల్ టూరిజంకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇదే కాకుండా నాణ్యమైన వైద్య, విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ప్రైవేటు వైద్య విద్య కళాశాలలు ఆరోగ్య విశ్వవిద్యాల యం పర్యవేక్షణలో ఉండేవి. కానీ ఇక నుంచి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే పర్యవేక్షించనుంది.

అలాగే ఇప్పటి వరకు ప్రైవేటు వైద్య, విద్య కళాశాలలు ఆరోగ్య విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో ఉండేవి. కానీ ఇక నుంచి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే పర్యవేక్షించనుంది. ఇప్పటికే ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. వైద్య విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయకుండా, స్టైఫండ్ విద్యార్థులకు సక్రమంగా అందే విధంగా కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలకు సైతం ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ అనే గొప్ప పథకాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ గత పాలకులు పెరిగిన వైద్య ఖర్చులకు అనుగుణంగా దీని పరిమితిని పెంచలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఒకటైన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజుల్లోనే ఈ హామీని అమలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో నర్సింగ్ సిబ్బందిని పెంచేందుకు 6,956 మంది స్టాఫ్ నర్సుల నియామకాలను చేపట్టారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఏకంగా రూ.11,500 కోట్లు కేటాయించారు. దక్షిణ భారతదేశంలో ప్రజా వైద్యంపై చేస్తున్న ఖర్చులో ప్రభుత్వ వాటా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. వైద్యం కోసం చేసే ఖర్చులో ప్రజలపై తక్కువ భారం పడుతున్న రాష్ట్రాలలో దేశంలోనే తెలంగా ణ 3వ స్థానంలో ఉంది. ఇదే కాకుండా ప్రసూతి మరణాల రేటు తగ్గింపులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలో నిలిచింది.

# పట్టు వస్త్రాల మహోత్సవంలో మాజీ ఎంపీపీ రేఖ, శ్రీధర్ రెడ్డి





**కొండమల్లేపల్లి, ఆగస్టు 28 శాసనసభ న్యూస్:** రావుల వెంకన్న రేణుక దంపతుల కుమార్తెల పట్టు వస్త్రాల మహోత్సవ కార్యక్రమానికి కొండమల్లేపల్లి మాజి ఎంపీపీ దూదిపాల రేఖ - శ్రీధర్ రెడ్డి హాజరై వారి కుమార్తెలను ఆశీర్వదించడం జరిగింది. వారి వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అదేవిధంగా బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ హాజరై రావుల వెంకన్న, రేణుక దంపతుల కుమార్తెలను ఆశీర్వదించారు రవీంద్ర కుమార్ వెంట టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొనడం జరిగింది

# రైతు సోదరులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



వర్కాల గ్రామ సభలో మాట్లాడుతున్న ఏవో శ్రావణ కుమారి

**చింతపల్లి ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** చింతపల్లి మండలంలోని గ్రామాల్లో రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి కోరారు. బుధవారం మండల పరిధిలోని వర్కాల, నసర్లపల్లి గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట రుణమాఫీ రెండు లక్షల రూపాయల లోపు తీసుకొని ఉండి రేషన్ కార్డు లేకుండా పంట రుణమాఫీ కానీ రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణ కొరకు యాప్ ద్వారా వివరాలు నమోదు చేయబడతాయని తెలిపారు. రైతు కుటుంబ సభ్యులందరూ ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు తీసుకొని గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు. 29న నేల్వలపల్లి, తీదేడు, 30న తిరుమలాపురం, ఉప్పరపల్లి, 31న గడియ గౌరారం, హరిజనాపురం, 2 న కురుమేడు, గొల్లపల్లి 3 న ప్రశాంతపురి తండా, కుర్మపల్లి 4 న సాయి రెడ్డిగూడెం, మోదుగుల మల్లేపల్లి, 5 న మల్లారెడ్డిపల్లి ,హెూమంతాలపల్లి, 6 న వింజమూరు, కిష్టరాయనపల్లి, 9 న జర్పుల తండా, అనాజిపూర్, కొక్కిరాల గౌరారం, 10 న రాయినిగూడెం, ధైర్యపురితండా,11 న దేన్యతండా, చింతపల్లి, 12 న పీకే మల్లేపల్లి, రోటి గడ్డ తండా, 17 న బోటి మీది తండా, పాలెం తండా, 18 న మదనాపురం, ఉమ్మాపురం 19 న చాకలిసేరి పల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మాదకద్రవ్యాల నియంత్రణపై అధికారులతో అవగాహన ర్యాలీ






ఎంపీడీవో కార్యాలయం నుండి చింతపల్లి చౌరస్తా వరకు ర్యాలీ

లిచింతపల్లి చౌరస్తాలో మానవహారం

**చింతపల్లి, ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:**
మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై బుధవారం అవగాహన ర్యాలీ చింతపల్లి మండల కేంద్రంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ఉద్యమంలా ప్రతీ ఒక్కరూ కదిలి రావాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.
నాంపల్లి సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ....




జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నియోజకవర్గం లోని ప్రతి మండలం, గ్రామాల్లో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా యువతకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.
మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిపై ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ముఖ్యమైనదని, ప్రతీ ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు కంకణబద్దులు కావాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాలపై ఫిర్యాదులు, స్టేషన్ కు ఫోన్ చేసి తమ సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు. ఏ ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభావితులు కావద్దని సూచించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావలపై అన్ని కళాశాలలు, పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వారి నేతృత్వంలో పోలీస్ శాఖ మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలియజేసేవారికి రివార్డులు కూడా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని అందించి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మెడికల్ షాపుల్లో మత్తుకు సంబంధించి ఏవిధమైన మందులు విక్రయించినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.వివిధ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేసి మాదక ద్రవ్యాల వినియోగానికి తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, నాంపల్లి సీఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్సై బినమోని యాదయ్య, పోలీస్ సిబ్బంది రెవెన్యూ శాఖ మహిళా సంఘాలు, అంగన్వాడి సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితర శాఖలకు చెందిన అధికారులు అవగాహన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ.



**తుర్కయంజాల్,ఆగస్టు 28(శాసన సభ ):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఓం గణేష్ నగర్ కాలనీ ఫేస్ -2 లో బుధవారం ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఎలిమినేడు జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఉచిత బస్సు పాసులో పంపిణీ



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు జడ్.పి.హెచ్.ఎస్ లో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచిత బస్సు పాసుల పంపిణీ బుధవారం టై, బెల్టుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట్ నర్సప్ప ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్ అధ్యక్షత వహించారు. వెంకట నరసప్ప మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రభుత్వము అన్ని సౌకర్యాలు అందిస్తుందని అంతేకాకుండా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ప్రభుత్వ విద్యార్థులకు ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో మంచి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్ మాట్లాడుతూ పిల్లలకు టై బెల్టులు అందించిన దాత బజారు బిక్షపతిని అభినందించారు. ఆర్టీసీ సంస్థలో కండక్టర్ గా ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల అపేక్ష కలిగి వారికి ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించటం పట్ల అభినందనలు వ్యక్తం చేశారు. అదేవిధంగా యునైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారి ఆర్థిక సహకారంతో అందించిన ఉచిత బస్ పాసులు పట్ల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. వారు ఇదే విధమైన స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు అండదండలుగా ఉండాలని కోరారు.

## కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మండల విద్యాధికారి తరి రాములు



**పెద్ద అడిశర్లపల్లి, ఆగస్టు 28 శాసనసభ న్యూస్:** ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ ను ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బెన కట్ చేసి టోర్నమెంట్ ని ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి తరి రాములు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో ముందంజలో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ,జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ శోభన్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో రెడ్ చిల్లీస్ హెూటల్ ప్రారంభం

రిబ్బన్ కట్ చేసి హెూటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, ఆగస్టు 28 శాసనసభ న్యూస్** దేవరకొండ పట్టణంలోని శివాజీ నగర్ సత్య సాయి కాలేజీ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రెడ్ చిల్లీస్ హెూటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి,షాప్ యాజమానికి శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. అనంతరం షాప్ యజమాన్యం ఎమ్మెల్యే బాలునాయక్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీహెచ్ పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



**యాచారం, ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** యాచారం మండలం మాల్ మార్కెట్ లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జెండా అవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమ%శీ%లో వికలాంగుల హక్కుల పోరాట సమితి యాచారం మండలం అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షులు నల్లవెల్లి పోశయ్య,మాజీ అధ్యక్షులు ఎండి సలీం , మాజీ సర్పంచ్ బెల్లి జంగయ్యయాదవ్ , మాజీ సర్పంచ్ పడకంటి కవిత శేఖర్ గౌడ్, యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్, గ్రామ శాఖ అధ్యక్షులు గిరి,గాలయ్య, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు గుండ్లపల్లి మురళి, యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు వరికుప్పల తిరుమలేష్, ఎం ఆర్ పి ఎస్ నాయకులు మంద లింగం, కంబాలపల్లి సాయిలు, చందర్, శివరాజ్,బాలకృష్ణ, బొడ్డుపల్లి నర్సింహ్మా చారి, గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జగతిఫౌండేషన్ఆధ్వర్యంలో చిన్నారులకు బ్యాగులపంపిణి





**మర్రిగూడ, ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** మర్రిగూడ మండలంలోని యరగండ్ల పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాదులోని జగతి ఫౌండేషన్ చైర్మెన్..దుర్గా కళ్యాణి, సభ్యులు జ్యోష్న రెడ్డి , పూర్ణ చందర్ రెడ్డి , రామచందర్, అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆగష్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల చిన్నారులకు బ్యాగుల పంపిణీ చేయడం జరిగినది . పాఠశాల ప్రధానోపాధ్యాయూరాలు మాలతి, మర్రిగూడ మండల సబ్ ఇన్స్పెక్టర్ రంగారెడ్డి విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సహకం బహుమతులు అందజేయడం చాలా సంతోషకరమని విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత చిన్నారులకు విద్యపట్ల, క్రీడల పట్ల ఆసక్తి కలిగించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోస్తాహక బహుమతులు అందజేయడం అభినందనీయనమని, విద్యార్థులు క్రమశిక్షణతోమెలగాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మర్రిగూడ ఎస్ఐ రంగారెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యయురాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కు నోట్ పుస్తకాలు, బ్యాగులు అందించడం అభినందనీయమని, జగతి ఫౌండేషన్ చైర్మన్ కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యరగండ్లపల్లి గ్రామ వాస్తవ్యులు జమ్ముల వెంకటేష్ గౌడ్, సీలివేరి యాదయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# వేములవాడ ఆలయాన్నిఅభివృద్ధిచేస్తాం



**రాజన్న సిరిసిల్ల :** వేములవాడ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. వేములవాడ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. స్వామి వారి పూజ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గోన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీ రాజ రాజేశ్వర స్వామి భక్తుడిగా శ్రావణ మాసం సందర్భంగా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి దర్శనం చేసుకున్నాం. వేములవాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేములవాడ ఆలయం పై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక భక్తులు వచ్చే ఆలయం. ఆలయం మరింత అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వ పక్షాన దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యానికి అనుగుణంగా శాస్త్రోక్తంగా వేదపడింతుల ,శృంగేరి పీఠాధిపతి సలహా సూచన మేరకు ఆలయ విస్తరణ చేస్తామని అన్నారు. శివుని ఆశీర్వాదం అడుగుతున్నాం. నేను ఎమ్మెల్యే అది శ్రీనివాస్ కలిసి తిరుమల లో ఉన్న నిత్యాన్నదాన కార్యక్రమం లాగ వేములవాడ లో కూడా నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేస్తాం. భక్తులు ,దాతలు కూడా సహకరించాలి. రాబోయే కార్తీక మాసంలో నిత్యాన్నదాన సత్రం ప్రారంభించాలని అనుకుంటున్నాం. తిరుమల లో వెంగమాంబ సత్రం మాదిరి వంటకి సంబంధించి అత్యాధునిక సామాగ్రి తో సహా అన్ని ఏర్పాట్లు చేసే శక్తిని ఆ భగవంతుడు ప్రసాధించాలి. తిరుపతి లో అన్నదాన సత్రం ప్రారంభించిన ఎన్టీఆర్ గారిని జ్ఞాపకం ఉంచుకుంటామని అన్నారు. వేములవాడ లో భక్తులు స్ట్రాక్చర్ ఇచ్చే వారినీ జ్ఞాపకం ఉంచుకుంటాం. ఎన్ని కష్టాలు వచ్చిన అందరూ సహకరించాలి.. భక్తులు అంత స్వచ్ఛంద సంస్థలు దేవాలయానికి సహకరించాలి. నిత్యాన్నదాన సత్రం ప్రభుత్వం నుండి భవన నిర్మాణానికి ఆది శ్రీనివాస్ తో కలిసి పూనుకున్నాం. కార్తీక మాసం వరకు ఈ నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తాం. ఇది దక్షణ కాశి..భక్తులు కోడెలు కట్టేస్తారు. నేను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే భవిష్యత్ లో వేములవాడ గోశాల కి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారి శ్రీనివాస్ ను పంపించారు.. వేములవాడ లో ఉన్న 2 ఎకరాల స్థలాన్ని టూరిజం కి అప్ప గించారు. స్వచ్ఛందంగా కుల సంఘాలు సత్రాలు కట్టుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. తెలంగాణ లో రైతాంగం అంత సమృద్ధిగా వర్షాలు కురుస్తూ ఆయు ఆరోగ్యాలతో ఉండాలనీ ఆ స్వామి వారిని కోరుకున్నా. భక్తులు ఇచ్చిన కోడె లు పక్కదారి పట్టకూడదు. మేము ఇద్దరం భక్తులంగా దేవాలయ అభివృద్ధి కృషి చేస్తాం. దేవాలయ దాతలకు హృదయ పూర్వక విజ్ఞప్తి చేస్తున్న ఆలయ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

# కరీంనగర్‌లో చెరువులు, నాలాల ఆక్రమణ

**కరీంనగర్ :** బరితెగించిన కోడి బజార్లో గుడ్డు పెట్టిందట. అచ్చం అలానే ఉంది భూ కబ్జాదారుల యవ్వారం. ఓవైపు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంటే.. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూ కబ్జాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో హైడ్రా హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. జిల్లాలకు విస్తరించాలని జనం కోరుతున్నారు.జగిత్యాల మండలం మోతె చెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు. ఎఫ్టీఎల్ పరిధిలో మట్టిని తీసి చెరువు స్థలాన్ని కబ్జా చేసే పనిలోపడ్డారు. జేసీబీతో చెరువు మట్టి తీసి.. కబ్జా చేసిన స్థలాన్ని చదును చేస్తుండగా మత్స్యకారులు అడ్డుకున్నారు. రెండు రోజుల నుంచి ఎఫ్టీఎల్ పరిధిలో స్థానిక కౌన్సిలర్.. జేసీబీతో మట్టి పోసి కబ్జా చేస్తున్నారని ఆందోళనకు దిగారు. మట్టి తీసే పనులను అడ్డుకుని చెరువు భూమిని కాపాడాలని పోలీసులకు పిర్యాదు చేశారు. మోతే చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో సుమారు 20 ఎకరాల వరకు కబ్జా అయ్యిందనే ఆరోపణలు ఉన్నాయి.అక్కడ, ఇక్కడ అనే తేడా లేదు. ఎక్కడ చూసినా చెరువులు కుంటలు కబ్జాకు గురయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వందలాది చెరువులు కుంటలు కనుమరుగయ్యాయి. పట్టించుకునేవారు లేక కబ్జా గురైన చెరువుల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 13,456 హెక్టార్లలో 1008 చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటికి హద్దులు నిర్ణయించకపోవడంతో కబ్జాదారుల కన్నుపడి కనుమరుగైపోతున్నాయి.కరీంనగర్ సమీపంలోని గ్రామాల్లో నూటికి 70 శాతం చెరువులు కుంటలు మాయమైపోయాయి. బొమ్మకల్, తీగలగుట్టపల్లి, ఆరపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, చింతకుంట, అలుగునూరు గ్రామాలు భూమాఫియాకు అడ్డాగా మారాయి. ముఖ్యంగా బొమ్మకల్ గ్రామ పరిధిలో 46.21 ఎకరాల్లో ఉన్న జక్కప్ప చెరువు, 28.10 ఎకరాల్లో ఉన్న గోపాల్ చెరువు, 16.10 ఎకరాల్లో ఉన్న నల్లచెరువు, 12 ఎకరాల్లో ఉన్న గోధుమకుంట, 9.10 ఎకరాల్లో ఉన్న రావికుంట కబ్జాకు గురయ్యాయి.కరీంనగర్ సమీపంలోని అలుగునూరు మామిడికుంటలో అక్రమ నిర్మాణాలు వెలిచాయి. నగరాన్ని ఆనుకుని ఉన్న బొమకల్ శివారులోని గోపాల్ చెరువు కనుమరుగయింది. చెరువు స్థలంలో రెండు గోదాములు తోపాటు ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగింది. తీగలగుట్టపల్లి, ఆరెపల్లి సమీపంలోని మాలకుంట, ఉడతకుంట, అవుసుల కుంట విస్తీర్ణం సగానికి తగ్గిపోయింది. తీగలగుట్టపల్లి మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఊరకుంటలో ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారు. కబ్జాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందినా చర్యలు మాత్రం శూన్యం.బొమ్మకల్ పై ఓవర్ బ్రిడ్జి పక్కన బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే విద్యా సంస్థ ఉంది. ఇక్కడ చెరువు శిఖం భూమిని కబ్జా చేయడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. గతంలో ఫిర్యాదులు రావడంతో.. అధికారులు సర్వే చేసి సర్కార్ భూమి ఎక్కడి వరకు ఉంటుందో నిర్ధారించారు. అయినా హద్దులు దాటి మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. బీఆర్ఎస్ పాలనలో కబ్జాలు మితిమీరిపోయా యనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ ఆఫీసర్ల చేతివాటం.. బడా లీడర్ల భరోసాతోనే చెరువులు, కుంటలు కనుమరుగయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అమాయకుల ప్లాట్లను కబ్జా పెట్టిన లీడర్లను.. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి జైలుకు పంపారు. కానీ.. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులపై ఫోకస్ పెట్టలేదు. ఇప్పటికైనా హైదరాబాద్ చుట్టుపక్కల అక్రమ కట్టడాలను కూలుస్తున్న హైడ్రా తరహాలోనే.. కరీంనగర్ కోసం కాడ్రాను ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయండి
## పుర చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి



**తుర్కయంజాల్,ఆగస్టు 28,(శాసన సభ ):** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని మసాబ్ చెరువులో జరిగే గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయమని పుర చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాం రెడ్డి,అన్నారు.బుధవారం కమిషనర్ అమరెందర్ రెడ్డి తోకలసి మసాబ్ చెరువు ఏర్పాట్లపై ఆరా తీశారు . గత సంవత్సరం కంటే ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున్న, రద్దీ లేకుండా చూడాలని కోరారు. ఇరిగేషన్, పోలీస్, ట్రాఫిక్, ఆ ర్ అండ్ బి, ఫిషరీష్, ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనాలకు, పుర ప్రజలు సహకరించాలని, భక్తి శ్రద్దలతో పండుగ జరుపుకోవాలని ఈ సంధర్భంగా చైర్ పర్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య, కౌన్సిలర్లు కుంట ఉదయ శ్రీ, రవీందర్ రెడ్డి శానిటరి స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఈ ఈ.హరీష్ పాల్గొన్నారు

బుధవారం పలు శుభకార్యాలలో పాల్గొన్న రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి. వివాహ శుభకార్యక్రమాలలో నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, ఈపూరి బద్రినాథ్, తోకటి కిరణ్, యోగేందర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 28 శాసనసభ న్యూస్ ప్రతినిధి:**



## అంగన్వాడిలో కలెక్టర్ కూతురు

**ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తమ మూడు సంవత్సరాల కూతురు స్వర ను అంగన్వాడీ కేంద్రానికి పంపి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే దంపతులు ఆదర్శింగా నిలిచారు. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తన 3 ఏళ్ల కూతురు స్వరాను ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంగన్వాడి స్కూల్ లో చేర్పించారు అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో కూర్చుని ఆట వస్తువులతోఆడుకుంటు అంగన్వాడి కేంద్రంలో వండిన భోజనం తింటున్న దృశ్యాలు అందరినీ అలరించాయి. కార్పొరేట్ పాఠశాలల్లో కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అనే అక్షర సత్యాన్ని కలెక్టర్ దంపతులు గుర్తించారు. అంగన్వాడీ కేంద్రాల్లో శిశువులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను గుర్తించి ఆదర్శంగా నిలిచారు కలెక్టర్ దంపతులు.

## మోడికి బీ టీంగా రేవంత్

**సూర్యాపేట :** జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మోడీకి బీ.టింగా పని చేస్తున్నాడు. ఏనాడైనా బిజెపిలో గుంపగొత్తుగా విలీనం అయ్యేది తెలంగాణ కాంగ్రెస్ ,రేవంత్ రెడ్డి మాత్రమే. మా ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై కాంగ్రెస్ బీజేపీలు నీచాతి నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. సోయి లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు జడ్జిలని తప్పు పట్టేలా విమర్శలు చేస్తున్నారు.. మేము మొదటి నుంచి చెప్తున్నాం తెలంగాణలో కాంగ్రెస్ బిజెపి కలిసి పని చేస్తున్నాయి. అసలు లిక్కర్ స్కామ్ అనేది ఒట్టి ఫాల్స్. అదంతా బిజెపి కుట్ర ..కేజ్రీవాల్ ని,, కేసీఆర్ ను అణగదొక్కాలని బిజెపి ఆడిన నాటకం లిక్కర్ స్కాం. నిన్న సుప్రీంకోర్టు జడ్జిలు ప్రశ్నలు అడుగుతుంటే ఈడీ, సిబిఐలు విలవిలలాడాయి.. నీళ్లు నమిలారు... సిబిఐ ,ఈడీలు పెట్టిన చెత్త కేసులలో లిక్కర్ స్కామ్ ఒకటని అన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే
## బీఆర్ఎస్ నేతకు బెయిల్

**కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జీ జువ్వాడి నర్సింగరావు**

**కోరుట్ల :** ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ నేతకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే జరిగిందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జీ జువ్వాడి నర్సింగరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతకు బెయిల్ వస్తుందన్న విషయం ఊహించిందేనని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్ వచ్చిందని నర్సింగరావు పేర్కొన్నారు. మొన్నటివరకు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ను దెబ్బతీయాలని చూశారని... కానీ పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్క య్యాయని నర్సింగరావు ఆరోపించారు. బీజేపీకి బీఆర్ఎస్ దాసోహం అయిందని... కేటీఆర్, హరీశ్ లు ఢిల్లీలో బీజేపీ నేతలకు ఆపద మొక్కులు మొక్కారని వ్యంగ్యం ప్రదర్శించారు. బీజేపీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగి కవితకు బెయిల్ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయని, తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఒక్కటే మిగిలిందని నర్సింగరావు అన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన
## గోపాలరావుపేట ఆల్ఫోర్స్ విద్యార్థులు

**రామడుగు :** మంచిర్యాల జిల్లా బెల్లం పల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జూనియర్ విభాగంలో పాల్గొని ప్రతిభను కనబరిచిన కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావుపేట ఆల్ఫోర్స్ పాఠశాల కు చెందిన విద్యార్థులు కే అశ్విత్ తొమ్మిదవ తరగతి బి వరుణ్ తేజ్ ఏ స్రవంతి ఎం అక్షర ఎనిమిదవ తరగతికి చెందిన విద్యార్థులు సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనారు. వీరు అక్టోబర్ నెలలో హర్యాన రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ

**సింగల్ విండో చైర్మన్ భాస్కర్ రావు**

**కమాన్ పూర్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయడం జరుగుతుందని సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు అన్నారు.బుధవారం కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామంలో పంట రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సభ వేశాధికారి గిరి రామకృష్ణ ఆధ్వర్యంలో జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ రుణమాఫీ కాని వారు మళ్లీ చేసుకోవాలని అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని చేరుకున్నారు.

## బిజినెస్

# మార్కెట్‌లోకి విడుదలైన మరో రెండు ఎలక్ట్రిక్ వెహికల్స్

దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఉన్న డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకు అనుగుణంగానే ఆయా సంస్థలు కూడా కొత్త కొత్త ఫీచర్లు కలిగిన ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తూనే ఉన్నాయి. కాగా ఇప్పటికే భారత మార్కెట్ లోకి ఎన్నో రకాల ఎలక్ట్రిక్ వాహనాలు విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా రకాల ఎలక్ట్రిక్ స్కూటర్లు మార్కెట్ లోకి విడుదల అయ్యాయి. వాటికి తోడు తాజాగా డియాన్ ఎలక్ట్రిక్ వెహికల్స్ సంస్థ రెండు ఇ స్కూటర్లకు ప్రారంభించింది. చెన్నైలో కొత్తగా షోరూమ్ ను కూడా మొదలు పెట్టింది. మరి ఈ డియాన్ ఎలక్ట్రిక్ స్కూటర్ల ప్రత్యేకతలు, ధర వివరాల విషయానికి వస్తే.. పవర్ ట్రాన్స్ మొబిలిటీ లిమిటెడ్ యాజ మాన్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న స్మార్ట్ మొబిలిటీ బ్రాండ్ డియాన్ ఎలక్ట్రిక్ వెహికల్స్. ఈ సంస్థ ఇటీవలే రెండు కొత్త ప్రత్యేకమైన ఇ స్కూటర్ మోడళ్లను పరిచయం చేసిన విషయం తెలిసిందే. వాటికి అగస్టా ఎస్పీ, ఆస్టా ఎఫ్ హెచ్ అని నామకరణం కూడా చేసింది. చెన్నైలోని రామాపురంలో కంపెనీ తన కొత్త షోరూమ్ ను ప్రారంభించింది. ఈ కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఏడు ఈవీ మోడళ్లు ఉన్నాయి. అలాగే మూడు షోరూమ్ లు, ఐదు సర్వీస్ సెంటర్ల కూడా ఏర్పాటు చేయనున్నారు. సర్వీస్ ప్రొవైడర్ తో భాగస్వామ్యంతో వినియోగదారులు తమిళనాడు అంతటా 256 స్టేషన్లలో వాహన సేవలను పొందవచ్చు. కాగా ఈ అగస్టా ఎస్పీ ఇ స్కూటర్ లోని 7.5 కేడబ్ల్యూ పీక్ పీఎంఎస్ఎం హబ్ మోటార్ తో పనితీరును చాలా సమర్ధంగా ఉంటుంది. ఈ బండి గరిష్టంగా 120 కేఎంపీహెచ్ వేగంతో పరుగులు తీస్తుంది. వెనుక స్ప్రింగ్ లోడ్ హైడ్రాలిక్ సస్పెన్షన్ ప్రత్యేకంగా అమర్చారు. అలాగే ఆస్టా ఎఫ్ హెచ్ వెనుక మోనో స్ప్రింగ్ లోడ్ హైడ్రాలిక్ సెటప్‌తో కూడిన అధునాతన బ్రేకింగ్ సిస్టమ్ కూడా ఉంది. ఫ్రంట్ టెలిస్కోపిక్ సస్పెన్షన్ వల్ల భద్రత, సౌకర్యం మరింత పెరుగుతుంది. రెండు మోడళ్లలో యాంటీ థెఫ్ట్ లాక్‌లు, ఫ్రంట్ ప్రొజెక్టర్ ఎల్ఈడీలు, వెనుక వైపు సాధారణ ఎల్ఈడీలు ఉన్నాయి.



### జీ-సోనీ సంస్థల రాజీ

దిగ్గజ మీడియా సంస్థలు జీ-సోనీ సంస్థలు ఎట్టకేలకు రాజీ కుదుర్చుకున్నాయి. ఇరు సంస్థల మధ్య నెలకొన్న వివాదం సమిసిపోయింది. జీ-సోనీ మధ్య విలీన ఒప్పందం రద్దు అయిన తర్వాత అనేక వివాదాలు నెలకొన్నాయి. ఒప్పంద రద్దు అనంతరం పరస్పరం పెట్టుకున్న కేసులను ఉపసంహరించుకునేందుకు ఓ నిర్ణయానికి వచ్చినట్లు మంగళవారం ఇరు సంస్థలు వెల్లడించాయి. నష్టపరిహారం కోసం న్యాయ పోరాటాలు చేయాలని రంగంలోకి దిగాయి. సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌తో పాటు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, ఇతర ఫోరమ్స్‌లో పరస్పరం దాఖలు చేసుకున్న న్యాయ పోరాటాలకు ముగింపు పలకాలని అంగీకారానికి వచ్చాయి. ఎవరికి వారు మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో సొంతంగా రాణించడంపై దృష్టి సారించాలని భావించాయి. 2023 ఆగస్టు 10న ఈ రెండు సంస్థలు విలీన ప్రతిపాదనలు చేసుకున్నాయి. జీ ఎంటర్‌టైన్మెంట్‌తో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్మెంట్) 10 బిలియన్ డాలర్లు (రూ.83 వేల కోట్లు) విలీన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ తర్వాత ఇరు సంస్థల మధ్య అభ్యంతరాలు రావడంతో వివాదాలు నెలకొన్నాయి. తాజాగా సమసి పోవడంతో మంగళవారం జీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ షేర్లు ఒక దశలో ఏకంగా 14 శాతం పెరిగాయి. చివరకు 11.56 శాతం లాభంతో ముగిశాయి.

### తగ్గిన బంగారం, పెరిగిన వెండి ధరలు ?



బంగారం ధరలో ప్రతీ రోజూ హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఓరోజు పెరిగితే, మరో రోజు తగ్గుతున్నాయి. బుధవారం దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు తగ్గాయి. సోమవార ఉదయంతో పోల్చితే ఈరోజు తులంపై సుమారు రూ. 10 వరకు తగ్గింది. దీంతో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,020కి చేరువైంది. మరి ఈరోజు దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,800గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,170 వద్ద కొనసాగుతోంది. అదే విధంగా ఆర్థిక రాజధాని ముంబయి విషయానికొస్తే ఇక్కడ 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,930కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది. ఇక చెన్నైలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,930, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది. బెంగళూరు విషయానికొస్తే ఇక్కడ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,930కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,930కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడతో పాటు, విశాఖపట్నంలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. వెండి ధరలు మాత్రం పెరిగాయి. బుధవారం కిలో వెండిపై రూ. 100లు పెరిగింది. దీంతో ఢిల్లీతోపాటు ముంబయి, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 88,600గా ఉండగా.. చెన్నై, కేరళ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో అత్యధికంగా రూ. 93.600 వద్ద కొనసాగుతోంది.

### దేశీయంగా 6 లక్షల 'యాపిల్' ఉద్యోగాలు



మనదేశంలో తయారీ, విక్రయ కార్యకలాపాలను పెంచుతున్న అమెరికా దిగ్గజ సంస్థ యాపిల్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి కల్లా 6 లక్షల ఉద్యోగాలను సృష్టించగలదని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఇందులో ప్రత్యక్షంగానే 2 లక్షల ఉద్యోగాలుంటాయని.. అందులోనూ 70% మహిళలకే ఇవ్వనున్నట్లు అంచనా. కంపెనీ, ఆ సంస్థ సరఫరాదార్లు ప్రభుత్వానికి సమర్పించిన సమాచారం ఆధారంగా ఈ అంచనాలు వెలువడ్డాయి. యాపిల్ కోసం మనదేశంలో ఐఫోన్లు, ఇతర ఉత్పత్తులను తయారు చేస్తున్న 3 కాంటాక్టు కంపెనీలైన ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ (అంతక్రితం విస్ట్రాన్), పెగాట్రాన్‌లు ఇప్పటికే 80,872 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించాయి. సరఫరాదార్లయిన టాటా గ్రూప్, సాల్‌కాంప్, మదర్‌సన్, ఫాక్స్‌లింక్ (తమిళనాడులో)బీ సన్‌వోడా (ఉత్తరప్రదేశ్)బీ ఏటీఎల్ (హరియాణ)బీ జబిల్(మహారాష్ట్ర) సంస్థలన్నీ కలిసి మరో 84,000 ఉద్యోగాలను ప్రత్యక్షంగా ఇచ్చినట్లు సమాచారం. స్మార్ట్‌ఫోన్ పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక) పథకాన్ని 2020లో ఆవిష్కరించినప్పటి నుంచి యాపిల్ వెండర్లు, సరఫరాదార్లు మొత్తం 1,65,000 ప్రత్యక్ష ఉద్యోగాలిచ్చాయని ఒక అధికారి వివరించారు. టాటా గ్రూప్‌నకు తమిళనాడులోని హొసూర్‌లో ఉన్న ప్లాంటు నుంచి ఐఫోన్లు అక్టోబరులో విపణిలోకి రానున్నాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే ఉద్దేశంలో కంపెనీ ఉన్నందున, ఈ ప్లాంటులో 50,000 మందిని నియమించుకోనున్నారు.

### ఆ రోజు ఒక్క ఆర్డరూ రాలేదు




ఇంట్లో కూర్చునే నచ్చిన రెస్టారంట్ల నుంచి ఆహారాన్ని తెప్పించుకొని ఆస్వాదిస్తోంది ఈ తరం. ఫుడ్ డెలివరీ యాప్స్ స్విగ్గీ, జొమాటో ప్రజలకు ఈ సౌకర్యాలను అందిస్తున్నాయి. ఈ ప్రయాణంలో స్విగ్గీ పదేళ్లు పూర్తి చేసుకుంది. దీనిని ఉద్దేశిస్తూ ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీహర్ష మాజేటి సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. తన ఫస్ట్ డే గురించి వెల్లడించారు. 'ఆగస్టు 6, 2014లో మేం స్విగ్గీని ప్రారంభించాం. ఫుడ్ ఆర్డర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూశాం. కానీ, మొదటిరోజు మాకు ఒక్క ఆర్డరూ రాలేదు. మరుసటి రోజు తొలి ఆర్డర్ అందుకున్నాం. అదే మా జర్నీలో అసలైన ప్రారంభానికి గుర్తు. మా తొలి భాగస్వాముల్లో ఒకటైన ట్రఫుల్స్ రెస్టారంట్ నుంచి ఆహారం కోసం మాకు రెండు ఆర్డర్లు వచ్చాయి. అప్పటి నుంచి వారితో మా భాగస్వామ్యం బలపడింది. ఒక దశలో ఒక్క రోజులో 7261 ఆర్డర్లు అందుకున్నాం" అని శ్రీహర్ష తన సంస్థ ఎదుగుదల గురించి వెల్లడించారు. ఫుడ్ డెలివరీ కాన్సెప్ట్ అప్పుడప్పుడే అందరికీ చేరువవుతోన్న తరుణంలో తమపై విశ్వాసం ఉంచిన రెస్టారంట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మూడు లక్షల రెస్టారంట్లతో కలిసి పనిచేస్తున్నామన్నారు. అది తమకెంతో గర్వకారణమని తెలిపారు. ఆ మద్దతే ప్రతి ఇంట్లో తమ పేరు వినిపించేందుకు కారణమైందన్నారు.

# షకిబ్‌కు లైన్‌క్లియర్



బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకిబ్ అల్ హసన్ క్రికెట్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా బంగ్లా క్రికెట్ బోర్డు అధ్యక్షుడు దీనిపై స్పందించినట్లు కథనాలు వస్తున్నాయి. ఎఫ్ఐఆర్ నమోదైనంత మాత్రాన నేరారోపణ రుజువు అయినట్లు కాదని.. ఒకవేళ దోషిగా తేలి శిక్ష పడినప్పుడు అతడిపై వేటు వేసే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. "షకిబ్ క్రికెట్‌లో కొనసాగుతాడు. మాకు లీగల్ నోటీసులు అందిన మాట వాస్తవమే. అతడిని స్వదేశానికి పంపించాలని అందులో పేర్కొన్నారు. మేం మా సమాధానం ఇచ్చాం. ఆటలో కొనసాగుతాడని చెప్పాం. ఇప్పుడు ఎఫ్ఐఆర్ మాత్రమే నమోదైంది. కేసు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. అతడు దోషిగా తేలేవరకూ క్రికెట్ ఆడేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. పాక్ పర్యటన తర్వాత భారత్‌కు బంగ్లా జట్టు వెళ్లనుంది. ఆ సిరీస్‌లోనూ అతడిని చూడాలని అనుకుంటున్నాం. అతడు మా కాంట్రాక్ట్ ప్లేయర్. న్యాయపరమైన అవసరం ఉంటే అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాం. చాలారోజులపాటు సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడలేదు. దీంతో షకిబ్‌కు సర్రే కౌంటీ క్రికెట్ ఆడేందుకు ఎన్‌వోసీ కూడా ఇచ్చాం. అక్కడ ఆడటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనే ఉద్దేశంతో అలా చేశాం. ఇప్పుడు జాతీయ జట్టులోకి వచ్చాక ఉత్తమ ప్రదర్శన చేస్తున్నాడు" అని బీసీబీ అధ్యక్షుడు ఫరూఖీ అహ్మద్ వెల్లడించారు. ప్రస్తుతం షకిబ్ పాక్ పర్యటనలో ఉన్నాడు. తొలి టెస్టులో బంగ్లాదేశ్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. రెండో టెస్టు ముందు స్వదేశానికి పంపించాలని బీసీబీకి ఆ దేశ ప్రభుత్వం నోటీసులు కూడా జారీ చేసింది. అతడిపై నిషేధం విధించాలని హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన రూబెల్ తండ్రి రఫీకుల్ ఇస్లామ్ లాయర్లు బీసీబీకి నోటీసులు పంపారు. అన్ని ఫార్మాట్లలో అతడిపై బ్యాన్ విధించాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. ఇప్పుడు బీసీబీ అధ్యక్షుడి నుంచి ఇలాంటి ప్రకటన రావడంతో బంగ్లా క్రికెట్ అభిమానుల్లో మళ్లీ గందరగోళం మొదలైంది.

### బీసీసీఐ కార్యదర్శి రేసులో ఉన్నది ఎవరంటే?



ఐసీసీ అధ్యక్షుడిగా జై షా ఎన్నిక కావడం దాదాపు లాంచనమే. ఎందుకంటే 16 మంది సభ్యులలో 15 మంది జై షాకు అనుకూలంగా ఉన్నారు. ప్రస్తుతం జై షా బీసీసీఐ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 35 సంవత్సరాలు. అయితే నామినేషన్ దాఖలు విషయంలో ఇంతవరకు జై షా స్పష్టత ఇవ్వలేదు. నామినేషన్ వేసేందుకు ఈనెల 27 ఆఖరి తేదీ. స్పోర్ట్స్ వర్గాల ప్రచారం ప్రకారం జై ఎన్నిక కావడం దాదాపు లాంచనమే. అయితే అతడు ఐసీసీ అధ్యక్షుడయితే.. అతడి స్థానంలో బీసీసీఐ సెక్రటరీగా ఎవర్ని నియమిస్తారనేది సందిగ్ధంగా మారింది. పోటీ తీవ్రంగా ఉండడంతో ఎంపిక సస్పెన్స్ సినిమాను తలపిస్తోంది. బీసీసీఐ సెక్రటరీ రేసులో ప్రస్తుత బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కోశాధికారి ఆశిష్ షెలార్, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్, ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ, క్యాబ్ అధ్యక్షుడు అవిషేక్ దాల్మియా.. ఇలా చాలామంది పోటీలో ఉన్నారు. అయితే వీరంతా రాజకీయ పలుకుబడి, ఇంకా గట్టి నేపథ్యం కలిగి ఉన్నవారు. జై షా ఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించ కంటే ముందే ఆయన స్థానాన్ని కొత్త వారితో భర్తీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా భారత క్రికెట్ బోర్డుకు జై షా సెక్రటరీ గా సాగుతున్నారు. భారత క్రికెట్ ను విస్తృతం చేయడంలో ఆయన విజయవంతమయ్యారు. కష్టకాలంలో తన వ్యూహ చతురత ద్వారా భారత క్రికెట్ జట్టును ఒడ్డున పడేయగలిగారు. వచ్చే ఏడాది పాకిస్తాన్ లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. అయితే పాకిస్తాన్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ కచ్చితంగా ఆడాల్సిందేనని ఒత్తిడి తీసుకొచ్చింది. ఇదే సమయంలో ఐసీసీ పెద్దలతో కూడా సంప్రదింపులు జరిగింది. ఒకానొక దశలో భారత జట్టు పాకిస్థాన్ లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ లో పాల్గొంటుందనే వార్తలు వినిపించాయి.

### హ్యారీ కేన్‌కు యూరోపియన్ గోల్డెన్ షూ అవార్డు

ఇంగ్లండ్ ఫుట్‌బాల్ ఆటగాడు హ్యారీ కేన్ అరుదైన ఘనత సాధించాడు. యూరోపియన్ ఫుట్‌బాల్ లీగ్‌లో అత్యధిక గోల్స్ సాధించిన స్ట్రైకర్‌గా హ్యారీ కేన్ నిలిచాడు. దీంతో అతడికి గోల్డెన్ షూ దక్కింది. మూనిచ్‌లో జరిగిన కార్యక్రమంలో హ్యారీ దానిని అందుకొన్నాడు. ఈ లీగ్‌లో ఇప్పటి వరకు మూడుసార్లు టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఒక్క సీజన్‌లోనే 32 మ్యాచుల్లో 36 గోల్స్ సాధించడం విశేషం. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును కొద్దిలో చేజార్చుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో అత్యధిక గోల్స్ (41) చేసిన ఆటగాడిగా మాజీ స్ట్రైకర్ రాబర్ట్ లెవాన్‌డౌస్కి కొనసాగుతున్నాడు. "గోల్డెన్ షూ అందుకోవడం అద్భుతమైన ఫీలింగ్. ఈ అవార్డు అందరికి అంకితం. మీ అభిమానం లేకపోతే ఇది సాధ్యం కాదు. నేను ఇక్కడ ఉండేవాడిని కాను. కొత్త సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు ఎలాంటి ముగింపు ఇచ్చానో.. అదే ఉత్సాహంతో ముందుకు సాగుతా. టైటిళ్లను సొంతం చేసుకోవడం చాలా ముఖ్యం. జట్టుగా మేం విజయవంతమైనట్లు భావిస్తున్నా. ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ మునిచ్‌లో జరగనుంది. మేం ఫైనల్‌లో ఆడతామనే నమ్మకంతో ఉన్నా. మా జట్టు గెలుపే నాకు ముఖ్యం. అదే జరిగితే నేను గోల్స్ చేయకపోయినా పెద్దగా కంగారు పడను" అని హ్యారీ వెల్లడించాడు.

## స్పోర్ట్స్

# టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తా



ఐసీసీ కొత్త చైర్మన్‌గా జే షా ఎన్నికైన విషయం తెలిసిందే. తన పదవీకాలంలో టెస్టు క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు షా తెలిపారు. క్రికెట్ పురోగతికి అడ్డుగా నిలిచిన అన్ని అవరోధాలను తొలగించనున్నట్లు ఆయన చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన గ్రేగ్ బార్‌క్లే నుంచి ఐసీసీ చైర్మెన్ బాధ్యతలను జే షా స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. టీ20 క్రికెట్ సహజంగా ఉత్సామభరితమైన ఫార్మాట్ అని, కానీ దానికి సమానంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎందుకంటే క్రికెట్‌కు అదే మూలాధారమైందని షా తెలిపారు. బీసీసీఐ కార్యదర్శి షా.. దీనిపై మంగళవారం ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. లాంగెస్ట్ ఫార్మాట్ క్రికెట్ ఆడేదిశగా క్రికెటర్లను మళ్లించాలని, ఆ దిశగా తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. ట్యాలెంట్ ప్లేయర్ల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆట ప్రమాణాన్ని పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేయనున్నట్లు షా హామీ ఇచ్చారు. చాలా కీలకమైన బాధ్యతను అప్పగించారని, మీ ఆశయాలకు తగినట్లు, అందమైన క్రికెట్ ఆటకు అంకిత అవుతానని షా తెలిపారు. అక్టోబర్‌లో జరిగే బీసీసీఐ బోర్డు మీటింగ్‌లో ఆయన తన కార్యదర్శి పోస్టును వదులుకునే అవకాశాలు ఉన్నాయి. ఐసీసీ చైర్మెన్‌గా ఎన్నికైన అయిదు భారతీయుడిగా నిలిచాడతను. గతంలో జగన్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్ శ్రీనివాస్, శశాంక్ మనోహర్.. ఆ హై ప్రొఫైల్ జాబ్ చేశారు.

# ఆ వార్త తెలియగానే షాకయ్యా



కోల్‌కతా వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన తననెంతో బాధ పెట్టిందని నటి మాళవిక మోహనన్ విచారం వ్యక్తం చేశారు. మహిళల భద్రత గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మూలాలను కనుగొని వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. ''ఇటీవల మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నేను ఓ ప్రమోషన్‌లో పాల్గొని మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో ఈ వార్త తెలిసింది. షాక్‌కు గురయ్యాను. ఇలాంటి ఘటనలు మహిళలను నిస్సహాయుల్ని చేస్తాయి. ఎలా.. ఎక్కడ ఎటు నుంచి ఆపద వస్తుందో తెలియడం లేదు. చాలా మంది స్త్రీలు ఇలాంటి ఘోరాల గురించి బయటకు చెప్పడానికి కూడా ఆలోచిస్తుంటారు. వారిపై జరిగిన దాడిని రహస్యంగా ఉంచుతున్నారు. చర్చించాలనుకుంటే ఇలాంటివి ఎన్నో ఉన్నాయి' అని చెప్పారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్య విద్య నియంత్రణ సంస్థ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని వైద్యకళాశాలలు, వసతిగృహాల్లో వారి భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశిస్తూ వైద్య కళాశాలలకు అడ్వయిజరీ జారీ చేసింది.

# నా హృదయం ముక్కలైంది



హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వరా భాస్కర్. నివేదికలో వెల్లడించిన షాకింగ్ విషయాలపై ఆమె విచారం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ సభ్యులను ఆమె ప్రశంసించారు. వారి వల్లే ఈ కమిటీ ఏర్పడిందని, మలయాళ సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు బహిర్గతం అయ్యాయని తెలిపారు. ''హేమ కమిటీ నివేదికలోని పలు విషయాలు చదివి నేను షాకయ్యా. మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులు చూసి నా హృదయం ముక్కలైంది. ఇలాంటి పరిస్థితులు అన్ని రంగాల్లోనూ ఉన్నాయి. సినిమా పరిశ్రమలో పురుషాధిక్యత ఎక్కువ. ఇది రిస్క్‌తో కూడుకున్నది కూడా. సినిమా ప్రారంభం నుంచి విడుదలయ్యే వరకూ ఎంతో డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఈ క్రమంలో ఎవరైనా మహిళలు ఇలాంటి సంఘటనల గురించి పెదవి విప్పినా పెద్దగా పట్టించుకోరు. ఇండస్ట్రీలో ఉన్న అగ్ర నటులు, నిర్మాతలు, దర్శకులను అందరూ దేవుళ్లుగా భావిస్తారు. వాళ్లు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. వారు ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే.. అక్కడ ఎటువంటి నియమాలు వర్తించవు. ఎవరైనా దాని గురించి బయటకు వచ్చి గట్టిగా తమ స్వరాన్ని వినిపిస్తే.. వారిని ట్రబుల్ మేకర్స్ అని ముద్ర వేసేస్తారు '' అని స్వరా భాస్కర్ తెలిపారు. అన్ని పరిశ్రమల్లోనూ మహిళలకు ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితుల గురించి జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఆ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది.

# క్రేజీ ఛాన్స్ కొట్టేసిన శ్రీలీల

ఉవ్వెత్తున ఎగసి వరస సినిమాలతో యమా స్పీడ్ తో దూసుకొచ్చిన శ్రీలీలకు వాటి పరాజయాలు గట్టి దెబ్బే వేశాయి. తక్కువ టైంలోనే మహేష్ బాబుతో చేసే ఛాన్స్ వచ్చినా దాని ఫలితం నిరాశ కలిగించింది. చిన్న బ్రేక్ తీసుకుని ఎంబిబిఎస్ పరీక్షలు పూర్తి చేసిన ఈ చలాకి భామకు ఆఫర్లయితే ఆగడం లేదు. వివిధ బాషల నుంచి క్రమం తప్పకుండా దర్శకులు కలుస్తున్నారు. నితిన్ రాబిన్ హుడ్ మినహాయించి ప్రస్తుతం తన చేతిలో టాలీవుడ్ మూవీ ఏదీ లేదు. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ ఎప్పుడు రీ స్టార్ట్ అవుతుందనే దాని మీద ఇంకా క్లారిటీ లేకపోవడంతో కొంత కాలం మినహాయించాలి. ఇదిలా ఉండగా శ్రీలీలకు మొదటి కోలీవుడ్ అవకాశం తలుపు తట్టినట్టు సమాచారం. ఆకాశం నీ హద్దురా దర్శకురాలు సుధా కొంగర పురాననూరుని తీయబోతున్న సంగతి తెలిసిందే. సూర్య హీరోగా తొలుత ఈ ప్రాజెక్ట్ లాకయ్యింది. కానీ ఏవో కారణాల వల్ల తను తప్పుకున్నాడు. ఇప్పుడిదే మూవీని శివ కార్తికేయన్ తో తెరకెక్కించబోతున్నట్టు తెలిసింది. స్థానికత గురించి వివాదాస్పద అంశం మీద రూపొందబోయే పురాననూరులో డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ విలన్ గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు తెలిసింది. ఇవన్నీ లీకుల రూపంలో వచ్చినవే తప్ప ఖరారుగా ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఒకరకంగా చెప్పాలంటే శ్రీలీలకు ఇది బంపర్ ఛాన్స్. సుధా కొంగర సినిమాల్లో హీరోయిన్ కు నటనపరంగా తగినంత ప్రాధాన్యం ఉంటుంది. అపర్ణ బాలమురళి, రితిక సింగ్ తదితరులు అలా పైకొచ్చిన వాళ్లే. ఈ పురాననూరు సైతం ఆషామాషీ కమర్షియల్ సబ్జెక్టు కాదు. కాంట్రవర్సీ ఉంటుందట.





# మల్టీప్లెక్సుల్లో నాని మాస్ షో

టాలీవుడ్లో నిలకడగా హిట్లు కొడుతూ, రేంజ్ పెంచుకుంటూ వెళ్తున్న హీరో.. నేచురల్ స్టార్ నాని. గత ఏడాది దసరా లాంటి మాస్ మూవీతోనే కాక హాయ్ నాన్న లాంటి క్లాస్ మూవీతోనూ అతను సక్సెస్ సాధించాడు. ఇప్పుడు 'సరిపోదా శనివారం' అనే మాస్, క్లాస్ మిక్స్ అయిన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. నాని కెరీర్లోనే అత్యధిక బిజినెస్ చేసిన చిత్రమిది. అలాగే హైప్ పరంగా కూడా నాని కెరీర్లో ఇది టాప్‌లో నిలుస్తుందని చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి సిటీలో, టౌన్లో ఒక పెద్ద హీరో సినిమా రేంజిలో ఇది రిలీజవుతోంది. హైదరాబాద్ సిటీలో వందల షోలు ఇచ్చారు 'సరిపోదా శనివారం' చిత్రానికి. ప్రతి మల్టీప్లెక్స్‌లోనూ మినిమం ఐదు షోలు పడుతున్నాయి. పెద్ద మల్టీప్లెక్సుల్లో అయితే 10 ప్లస్ షోలు వేస్తున్నారు. వాటికి స్పందన కూడా చాలా బాగుంది. బుక్ మై షో ఓపెన్ చేసి చూస్తే.. మల్టీప్లెక్సుల్లో ప్రతి షో ఫాస్ట్ ఫిల్లింగ్ మోడ్‌లో ఉంది. కొన్ని షోలు సోల్డ్ ఔట్ దశలో ఉన్నాయి. నానికి ముందు నుంచి క్లాస్ హీరోగా మంచి పేరుంది. తన సినిమాలు మల్టీప్లెక్సుల్లో బాగా ఆడతాయి. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా అక్కడ బాగా జరుగుతాయి. సింగిల్ స్క్రీన్లలో మిడ్ రేంజ్ సినిమాలకు ఆశించిన స్పందన ఉండదు. 'సరిపోదా శనివారం' చిత్రానికి కూడా సింగిల్ స్క్రీన్లలో బుకింగ్స్ ఓ మోస్తరుగా కనిపిస్తున్నాయంతే. కానీ మల్టీప్లెక్సుల్లో మాత్రం తొలి రోజు ప్రతి షో ఫుల్ అయితే ఆశ్చర్యమేమీ లేదు. ఐతే 'సరిపోదా శనివారం'లో మాస్ అంశాలకు లోటు లేనట్లే కనిపిస్తోంది. నాని కెరీర్లోనే ఎన్నడూ చూడనంత హీరోయిజం, ఎలివేషన్లు, యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాలో ఉంటాయని ట్రైలర్ సంకేతాలు ఇచ్చింది.



# విశ్వంభర రేటు 100 కోట్ల పైమాటే

వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10 విడుదల కాబోతున్న విశ్వంభర థియేట్రికల్ బిజినెస్ ని యువి క్రియేషన్స్ మొదలుపెట్టినట్టు సమాచారం. రేట్ల విషయం ఇంకా కొలిక్కి రానప్పటికీ నైజాం మైత్రికిచ్చి, సీడెడ్ తో సహా ఆంధ్ర అన్ని ప్రాంతాలకు ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్మెంట్స్ తో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదన దాదాపు ఓకే అయినట్టు సమాచారం. ఏపీ తెలంగాణ కలిపి సుమారు 120 కోట్ల దాకా ధరని కోట్ చేస్తున్నట్టు తెలిసింది. ఫైనల్ కాలేదు కానీ బేరసారాలకు సంబంధించిన చర్చలైతే జరుగుతున్నాయట. ఎక్కువ తక్కువ ఎంతైనా మినిమమ్ వంద కోట్లతో స్టార్టవుతుంది. చిరంజీవి గత చిత్రం భోళా శంకర్ డిజాస్టర్ అయినప్పటికీ దాని ప్రభావం మార్కెట్ మీద మరీ తీవ్రంగా పడలేదు. ఆ సినిమా విషయంలో చిరు కంటే మెహర్ రమేష్ వైపే వేళ్ళన్నీ ఎత్తి చూపాయి. విశ్వంభర ఫాంటసీ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన విజువల్ థ్రిల్లర్ కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. పైగా ఇన్ సైడ్ రిపోర్ట్స్, దర్శకుడు వసిష్ఠ పనితనం గురించి యూనిట్ చెబుతున్న మాటలు అంతకంతా అంచనాలు పెంచుతున్నాయి. దీని కోసమే చిరు వేరే కొత్త కమిట్ మెంట్స్ ఇవ్వకుండా విశ్వంభరకే పూర్తి సమయం కేటాయిస్తున్నారు. వచ్చే నెలలో గుమ్మడికాయ కొట్టొచ్చు. టీజర్ కూడా అదే నెలలోనే. రేటు వరకు ఎలా ఉన్నా విశ్వంభరకు పోటీ పరంగా చాలా సవాళ్లున్నాయి. బాలకృష్ణ 109 కాంపిటీషన్ కు సై అంటోంది. దిల్ రాజు తన వెంకటేష్- అనిల్ రావిపూడి మూవీని పండక్కి లాక్ చేశారు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918